


జగన్ వీకెండ్ రాజకీయ నాయకుడు. మోసాలు, అబద్ధాలే ఆయన రాజకీయాలకు ఆధారం. రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు దృష్టి లేదు. ఐదేళ్ల పాలనలో దోపిడీ మాత్రమే జరిగింది. వైసీపీ అసమర్థ పాలనతో వ్యవస్థలు దెబ్బతిన్నాయి. చంద్రబాబు విజన్ వల్లే ఐటీ రంగంలో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 18.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 330 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక ...

# 'దివ్యాంగ శక్తి'

- నేడు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- రాష్ట్రమంతటా దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం
- 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు పథకం వర్తింపు
- 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' విస్తరణ
- వెంట వచ్చే సహాయకులకు ఛార్జీల్లో 50 శాతం రాయితీ
- 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు లబ్ధి
- ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.207 కోట్ల వ్యయం
- ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా పథకానికి శ్రీకారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుక ప్రకటించింది. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలోని దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి బుధవారం అమరావతిలో శ్రీకారం చుడతారు. అలాగే ప్రతీ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దివ్యాంగ శక్తిని ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని మరోసారి నిరూపించింది. గతేడాది డిసెంబర్ 3న నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈరోజు ఆ మాట నిలబెట్టుకున్నారు.

**'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తింపు** : ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వాళ్లకు, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోంది. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోంది. అయితే 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అంటే దివ్యాంగులు ఇకపై సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క రూపాయి కూడా ఛార్జీ లేకుండా రాష్ట్రమంతా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అంతేకాదు, వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

**4 నుంచి 21 వర్గాలకు పథకం విస్తరణ** : ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించింది. శారీరక-మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, మిగతా 2లో...

### మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

**'యూనివర్సల్ హెల్త్ పాలసీ'తో నేతన్నల ఆరోగ్యానికి భరోసా**



- చేనేత రంగానికి అండగా కూటమి ప్రభుత్వం
- నేతన్నలకు మేలు చేసేలా పథకాల రూపకల్పన
- ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్
- 8 నెలల్లో ధర్మవరం మెగా క్లస్టర్ ప్రారంభిస్తాం
- ధర్మవరంలో ఆప్కో షో రూమ్ ఏర్పాటు : మంత్రి సవిత

**ఇమాములు, మౌజనులకు రూ. 45 కోట్లు విడుదల**



- మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం
- ఇమాములు, మౌజన్ లకు 24 గంటల వ్యవధిలో అకౌంట్లకు గౌరవ వేతనం జమ
- చంద్రబాబు మైనారిటీల పక్షపాతి
- హామీలను నెరవేర్చడమే లక్ష్యం
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్
- 6నెలల వేతనం రూ. 45 కోట్లు చెల్లింపుపై సీఎం కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూక్

## ఏపీకి అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ



- పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ పెంచేలా కార్యాచరణ
- రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ఆర్టీజీఎస్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ ఉంటే.. అదనంగా మరో 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ విశాఖలో అందుబాటులోకి వచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరా, సిలెండర్ల పంపిణీ, పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ సహా వివిధ అంశాలపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఏపీలో ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవని సీఎం స్పష్టం చేశారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా చూడాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్ప కాలికంగా ఉత్పత్తి పెంచటంతో పాటు పంపిణీ కూడా మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి గ్యాస్ సిలెండర్ల డెలివరీ సమయాన్ని 1.5 రోజులకు కుదించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మిగతా 2లో...

### రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే

## మన ఏకైక లక్ష్యం




- ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలిలి
- ఏపీఈడీబీ అధికారులకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం
- మంగళగిరిలో ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరి సమీపం చినకాకానిలోని మయూరి టెక్ పార్క్ భవనం ఐదో అంతస్తులో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు(ఏపీఈడీబీ) నూతన కార్యాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా టెక్ పార్క్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యాలయం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా ఏపీఈడీబీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ.- 2లో...

## ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థల ప్రక్షాళన



- మే 15 నాటికి నిర్వహణ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వచ్చే ఖరీఫ్ ప్రారంభానికి ముందే అంటే మే 15వ తేదీ నాటికి ఓ అండ్ ఎం పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు. మంగళ వారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఓ అండ్ ఎం పనుల పై ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి ఇరిగేషన్ పనులు చేసినా, నిర్వహణ సరిగా లేకపోతే, అంటే ఓ అండ్ ఎం పనులు ఏటా చేయకపోతే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు.

వందల,వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే, వైసిపి ప్రభుత్వం మెయింటెన్స్ కూడా లేకుండా గాలికొది లేసిందని మంత్రి విమర్శించారు. మిగతా 2లో...

### హిందూ ఉత్సవాల నిర్వహణకు

## ప్రత్యేక నిధులు కేటాయించాలి



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో జరగబోయే హిందూ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే వసంత నవరాత్రులు, ఉగాది, శ్రీరామనవమి వంటి ప్రధాన ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు అందుతున్నాయని ఆయన వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించడం, వసంత నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించడం అవసరమని సూచించారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు.

సాంప్రదాయ కళలను ప్రోత్సహించే దిశగా హరికథలు, బుర్రకథలు, భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని మాధవ్ సూచించారు. భక్తులకు తీర్థప్రసాదం, స్వచ్ఛమైన తాగునీరు, శుభ్రమైన పరిసరాలు వంటి మౌలిక వసతులు కల్పించడంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

ప్రజల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ హిందూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని పీవీయన్ మాధవ్ విజ్ఞప్తి చేశారు.



### విద్యార్థుల ఆరోగ్యంపై

## రాజీ పడేది లేదు

- మైలవరం స్కూల్‌లో లోకేష్ ఆకస్మిక తనిఖీ.
- మధ్యాహ్న భోజనం నాణ్యత స్వయంగా పరిశీలన
- తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశం

2 లో

### గిరిజన గర్భిణిల కోసం

## 35 నూతన నిరీక్షణ వసతి భవనాలు

- వీటిల్లో ప్రసవానికి వారం ముందే గర్భిణిలకు సపర్యలు
- రోజుకి గర్భిణి, సహాయకులకు కలిపి రూ. 600 చెల్లింపు
- ఈ కొత్త భవనాలతో గిరిజనులకు తగ్గనున్న వ్యయప్రయాసలు
- నిర్మాణాల పురోగతిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించిన అధికారులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : గిరిజన గర్భిణిల కోసం 7 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థల(ఐటీడీఏలు) పరిధిలో 35 నిరీక్షణ వసతి గృహాల కోసం కొత్త భవనాలు (బర్త్ వెయిటింగ్ హోమ్స్) నిర్మిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 15, రంపచోడవరం , పార్వతీపురం, చింతూరు, శ్రీశైలం, కోట రామచంద్రాపురంలో 4 చొప్పున భవన నిర్మాణాల పనులు రూ.12.25 కోట్లతో జరుగుతున్నాయని తెలిపారు. ఈ 35లో 22 కేంద్రాలు మే/జూన్ నెలల్లో, మరో రెండు జులై, మిగిలిన వాటిని ఈ ఏడాది చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా 3లో...

## మార్కెట్ కమిటీల చైర్మన్‌లకు
# చెక్ పవర్ పునరుద్ధరించాలి



- **మంత్రి లోకేష్‌కు విన్నవించిన చైర్మన్లు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ లకు చెక్ పవర్ ను పునరుద్ధరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు వ్యవసాయ కమిటీల చైర్మన్లు విన్నవించారు. మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేష్ ను రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ ల సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి నారా లోకేష్ కు వివరించారు. కమిటీల బలోపేతానికి, క్షేత్రస్థాయిలో మరిన్ని సేవలలో భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ, ప్రభుత్వ నియమ బంధనలలో మార్పులు చేయాల్సిన పరిస్థితులను సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు మంత్రికి వివరించారు. కమిటీల ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల పై పన్నుల వసూలు, గౌరవ వేతనాలు, డొంకరోడ్ల, నిర్మాణాలకు నిధులు మంజూరు,మార్కెట్ కమిటీ నిధుల నుండి సీఎంఎఫ్ 25 శాతం,20 శాతం పెన్షన్ కాంట్రిబ్యూషన్ పై నియంత్రణ తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా రైతు శ్రేయస్సు లక్ష్యం గా మార్కెట్ కమిటీ లు అభివృద్ధి చేసేలా మార్కెట్ కమిటీల చైర్మన్ ల కు చెక్ పవర్ పునరుద్ధరణ చేయాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ల పరిధిలో లింకు (పుంత) రోడ్ల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరారు.మార్కెట్ కమిటీ చైర్మల కాల పరిమితి 3 సంవత్సరాలు ఉండేలా నిబంధనలు సవరించాలని మంత్రి లోకేష్ కు వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లకు హోదాలో అలవెన్సులు తేడా లేకుండా ఒకేలా ఉండేలా తెలంగాణా ప్రభుత్వం జి.ఓ యం.యస్. నెం. 28, తే. 26-02-2018 తరహాలోనే ఏపీలో కూడా అమలు జరిగేలా చూడాలని అన్నారు.రైతు బజార్ల పర్యవేక్షణ మార్కెట్ యార్డు చైర్మన్ ల కు ఉండేలా చేయాలన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ లకు జిల్లా స్థాయితోపాటు, నియోజకవర్గ పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ వర్తించేలా చేయాలని మంత్రి నారా లోకేష్ దృష్టికి మార్కెట్ కమిటీల చైర్మన్ ల సంఘం ప్రతినిధులు తీసుకువెళ్లారు.ఈ విషయం పై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు మార్కెట్ కమిటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ల సంఘం ప్రధాన కార్యదర్శి కొండ ప్రవీణ్, ఉపాధ్యక్షులు అమర్నాథ్ యాదవ్, ఏరువా శ్రీనివాసులు, బర్రా వాసు, కదిలండీ రామచంద్ర రాజు, కిరణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థల ప్రక్షాళన



(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్ట మట్టి తీయకపోగా, షట్టర్లు,డోర్లు, గేట్లకు మరమ్మత్తులు చేయ లేదన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదని చెప్పారు.

గత పాలకులు చేసిన తప్పిదాలే మన పాలిట శాపాలయ్యాయని అన్నారు. వీటన్నింటినీ సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని ఆయన వివరించారు. ఎంత దారుణం అంటే గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో నిర్వహణ పనుల నిమిత్తం 200 కోట్లు కూడా ఖర్చు చేయకపోతే, కూటమి ప్రభుత్వం మొదటి రెండేళ్ళలోనే 878 కోట్లు మంజూరు చేసి ఖర్చు చేశామన్నారు .

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 2026 ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. అందుకుగాను ఓ అండ్ ఎం పనులు తక్షణమే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అంతేకాక అత్యవసర పనులన్నీ అత్యంత నాణ్యతతో చేయాలని సూచించారు.

రైతుల అవసరాల కోసం చెరువుల్లో పూడిక తీసిన మట్టిని, క్యూబిక్ మీటర్ 1 రూపాయి కే, రైతులకు సరఫరా చేసేలా అనుమతులు కూడా ఇచ్చామని ఆయన అన్నారు.

ఈ సమావేశం లో కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర క్యాలెండర్ల ఆవిష్కరణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**:వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార ప్రజాసంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "స్వర్ణాంధ్రఏ2047" క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం పేదరిక నిర్మూలన, ఉపాధి ఉద్యోగ కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయంలో సాంకేతికత, ప్రపంచ స్థాయి రవాణా, స్వచ్ఛ ఆంధ్ర 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఈ పది సూత్రాల ప్రాధాన్యతను వివరిస్తూ "స్వర్ణాంధ్రఏ2047" అంశంతో రూపొందించిన ఈ 2026 క్యాలెండర్లను ప్రజాప్రతినిధుల కార్యాలయాలకు, జిల్లా కార్యాలయాలకు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక...'దివ్యాంగ శక్తి'

(మొదటి పేజీ తరువాయి)

హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుంది. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ధి చేకూరుతుండగా... పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. వీరిలో పురుషులు 6.86 లక్షల మంది ఉన్నారు. అలాగే ఇప్పటివరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా... ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే మొత్తం లబ్దిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరిగనుంది.



**7,264 బస్సుల్లో ఉచిత ప్రయాణం** : ఈరోజు నుంచి స్త్రీ శక్తి పథకం వర్తించే 7,264 బస్సుల్లో దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీలో సుమారు 73 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. ఇప్పటికే దివ్యాంగులు, వారి సహాయకులకు 3 సంవత్సరాల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడతాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్స్‌ను సదరం యాప్‌తో అనుసంధానించినందున ఫిజికల్ సర్టిఫికేట్ చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు.

**ఏడాదికి రూ.207 కోట్ల వ్యయం** : ఈ పథక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రూ.207 కోట్లు సబ్సిడీ అందిస్తుంది. దివ్యాంగుల్లో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ఇది. స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక వెసులు బాటు, సాధికారత కల్పించింది. గతేడాది ఆగస్ట్ 15న స్త్రీశక్తి పథకం ప్రారంభిస్తే... ఈ మార్చి 15 నాటికి... అంటే 7 నెలల్లో 52 కోట్ల ప్రయాణాలు మహిళలు ఉచితంగా చేశారు. దీనికి ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,826 కోట్లు రాయితీ భరించింది. మహిళల ఉచిత ప్రయాణాలకు రోజుకు ప్రభుత్వం రూ.8.57 కోట్లు ఖర్చు పెడుతోంది. సగటున 24.38 లక్షల మంది స్త్రీ శక్తిని రోజూ వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రతీ వందమందిలో 37 మంది మగవాళ్లు ఉంటే, 63 మంది మహిళలే ఉంటున్నారు. ఇది స్త్రీ శక్తి పథకం ఎంతలా సూపర్ హిట్ అయ్యిందో చెబుతోంది. దివ్యాంగ శక్తి కూడా ఇంతే ఆదరణ పొందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దివ్యాంగులకు సమాజంలో సరైన స్థానం, గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రవేశ పెట్టడం ద్వారా మరోసారి నిలబెట్టుకున్నారు.

# ఏపీకి అదనంగా 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ ల స్టాక్స్ లభ్యతను కూడా తెలుసుకోవాలని సూచించారు.




**పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తృతికి చర్యలు** : ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, నెట్వర్క్ పెంపు పైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ మరింతగా విస్తరించే అంశంపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్, పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్ జీని ఏపీకి కేటాయించేలా చేసుకుని 2 సీజన్లలో పైప్ ద్వారా కొండపల్లి వరకూ తీసుకు రాగలిగామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎనర్జీ ట్రాన్సిషన్ జరిగేలా వ్యయం తక్కువ అయ్యే ఇంధనాన్ని వినియోగదారులకు అందించాల్సి ఉందని స్పష్టం చేశారు. పైప్డ్ గ్యాస్ సరఫరాకు సంబంధించి తక్షణం చేయగలమన్న అంశంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ లు సహజ వాయువును సరఫరా చేస్తున్నాయని అధికారులు వివరించారు. 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా ఈ సరఫరా జరుగుతోందని తెలిపారు. 1.68 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఇచ్చేలా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం సీఎన్జీ, పీఎన్జీ నెట్వర్క్ ను మరింత విస్తృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అమరావతితో పాటు పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాల ను పెంచేందుకు వీలుగా పెట్రోలియం కంపెనీలు కూడా సహకరించేలా కేంద్రంతో సంప్రదింపులు చేయాలన్నారు.

**త్వరలో ఏపీ వన్ యాప్ ద్వారా సేవలు** : ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులను సెన్సిటైజ్ చేయాలని సీఎం సూచించారు. సిటిజన్ సేఫ్టీ అవేర్‌నెస్ కింద వారికి సంక్షిప్త సమాచారాన్ని పంపించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు లింక్ ను యాప్ ద్వారా లేదా వాట్సప్ గవర్నెన్సు ద్వారా వినియోగదారులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రూపొందిస్తున్న ఏపీ వన్ యాప్ ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. డేటా లేక్, అవేర్ ను ప్రభుత్వ శాఖలు ఏమేరకు వినియోగించుకున్నది గుర్తించాలని సీఎం సూచించారు. వేసవిలో అవేర్ ద్వారా సమాచారం తీసుకుని తాగునీరు, హీట్ వేవ్స్, పశుగ్రాసం సహా వివిధ అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేలా ప్రజల్లో విస్తృతమైన మార్పు వచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రామాల్లో వ్యర్థాలను తొలగించి చెత్తను వర్గీకరించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయితీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, సురేశ్ కుమార్, దేవాదాయశాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, వివిధ పెట్రోలియం కంపెనీలు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులు హాజరయ్యారు.

## శివగంగలో ఎన్‌డీఏ నిరసనలో పాల్గొన్న కొక్కెర శ్రీనివాస్ యాదవ్





**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్)** : తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో మంగళవారం బీజేపీ, అన్నాడీఎంకే మరియు ఎన్‌డీఏ మిత్రపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తిరుప్పతూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్చి 10న తిరునెల్వేలి ప్రాంతంలో 17 సంవత్సరాల బాలికపై అగంతకులు అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటనకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఘటనలో నిందితులను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడంపై పోలీసుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఎన్‌డీఏ కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొక్కెర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తిరునెల్వేలిలో జరిగిన ఘటన అత్యంత దారుణమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

శివగంగ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి, శివగంగ నియోజకవర్గ ఎమ్మెల్యే సీ సెంథిల్ నాథన్ నాయకత్వంలో జరిగిన ఈ నిరసనలో తిరుప్పతూర్ అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్, శివగంగ అసెంబ్లీ ఇంచార్జ్ చక్రవర్తి, ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే
# మన ఏకైక లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలి. ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. యువగళం పాదయాత్ర సమయంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాను. జీడీ నెల్లూరులో పాదయాత్ర చేస్తున్న సమయంలో రోడ్డు పక్కన బజ్జీలు విక్రయించే మోహన అనే మహిళను కలిశాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం వద్దని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించాం. దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయాలు ఏపీకి వచ్చాయి. ఇందుకు ఈడీబీ బృందానికి అభినందనలు. సీఈవో సాయికాంత్ వర్మకు నా హృదయపూర్వక అభినందనలు.

**ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి** : గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మనం మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. ఎన్ని ఉద్యోగాలు కల్పించామన్నదే ముఖ్యం. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇది ప్రారంభం మాత్రమే. ఉద్యోగాల కల్పనే మన సింగిల్ ఎజెండాగా ఉండాలి. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలి. ఛాలెంజ్ గా తీసుకోవాలి. మన ఏకైక లక్ష్యం 20 లక్షల ఉద్యోగాల కల్పన అని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. మీ అందరూ మీకు కేటాయించిన క్లస్టర్‌లో నిపుణులుగా మారాలి. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించాం. వర్టికల్ ఇంటిగ్రేషన్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ పై దృష్టి సారించాలి. ఒప్పందం కుదుర్చుకున్న ప్రతి ప్రాజెక్ట్ గ్రౌండ్ కావాలి. ప్రతి ప్రాజెక్ట్ ను సమీక్షించడం జరుగుతుంది. ఏ ప్రాజెక్ట్ ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. అధికారులు, సిబ్బంది ఉన్నతంగా ఆలోచించాలి. ఈ నెల 23 రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నాం. ఇంతటితో తృప్తిపడకూడదు. ఎందుకు ఐదు స్టీల్ సిటీలు నిర్మించకూడదు? అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుంది. ప్రతిఒక్కరం ఎంతో కష్టపడుతున్నాం. దేశం, రాష్ట్రం, ఈడీబీ గర్వపడే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ ఎం.అభిషిక్త్ కిషోర్ ఇతర ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరాజుకు ఖుద్దుస్ అభినందనలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ )**:ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలలో న్యాయవాది ఉప్పలపాటి శ్రీనివాసరాజు ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలలో విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇంచార్జ్ ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి. శ్రీనివాసరాజు కు గుంటూరు లో బీజేపీ నాయకులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఖుద్దుస్ శ్రీనివాసరాజు ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఖుద్దుస్ మాట్లాడుతూ శ్రీనివాసరాజు ఎన్నికకు కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి దశ నుండే చురుకైన కార్య కర్తగా పనిచేస్తూ అంచెలాంచెలుగా ఎదిగారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల మద్దతుతో ఈ విజయాన్ని సాధించరన్నారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కొరకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రం లో బార్ అసోసియేషన్ సంక్షేమం కొరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు అధికార ప్రతినిధి షేక్ బాజీ,బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి. తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై రాజీ పడేది లేదు

**మైలవరం (జర్నలిస్ట్ ఫైల్)** : ఎన్టీఆర్ జిల్లా, మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనం బాగాలేదంటూ పాఠశాల హెచ్‌ఎం డ్రామా ఆడించిన ఘటన నేపథ్యంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు చెప్పారు. ఘటన జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉందని విద్యార్థులను మంత్రి అడిగారు. భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు.



**తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు** : ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీపై పవిత్ర బాధ్యత ఉంది. చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని మంత్రి హెచ్చరించారు. భోజనం నాణ్యతపై ప్రతివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని, అంగన్ వాడీ కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మైలవరం ఘటన నేపథ్యంలో విద్యార్థులకు అందే మధ్యాహ్న భోజనం పథకంపై ఇటీవల సమీక్షించిన మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలించాలని, బాగుందని నిర్ధారించాకే విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో ఒక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. భోజనం గురించి విద్యార్థులు చెబితే తల్లిదండ్రులు వెంటనే లీప్ యాప్ ద్వారా ఫిర్యాదులు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమూల మార్పు కోసం త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

## దేశ వ్యతిరేక శక్తులకు వేదికగా కాంగ్రెస్



- దేశ ఐక్యతకు సేవలందిస్తున్న ఆర్ఎస్ఎస్‌ను టార్గెట్ చేయడం తప్పు
- కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ నేత షేక్ బాజీ మండిపాటు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశ వ్యతిరేక వైఖరిని బయటపెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ మండిపడ్డారు. దేశ భద్రత కోసం పనిచేస్తున్న రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంటి సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు.
అమెరికా కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ విడుదల చేసిన నివేదికను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. చాలా ఏళ్లుగా భారత్‌పై ద్వేషభావంతో అసంబద్ధ కథనాల ఆధారంగా ఏకపక్షంగా, భావజాలపరంగా నివేదికలు ఇస్తూ దేశంపై తప్పుడు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై భారత విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా స్పందించి ఆ నివేదికలను తప్పుబట్టిందన్నారు.
భారత్‌పై అబద్ధపు విమర్శలు చేయడం పక్కన పెట్టి, అమెరికాలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులు, భారతీయులపై పెరుగుతున్న బెదిరింపులు మరియు వివక్ష వంటి అంశాలపై ఆ సంస్థలు స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. విదేశీ సంస్థలు పథకపూర్వకంగా భారత్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దేశ వ్యతిరేక శక్తులకు వేదికగా మారిందని విమర్శించారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిస్థితుల సమయంలో కూడా గ్యాస్ సరఫరా అంశంపై తప్పుడు ప్రచారాలు సృష్టించే ప్రయత్నం చేశారని అన్నారు.
రా వంటి సంస్థలు దేశాన్ని ఉగ్రవాదం వంటి ముప్పుల నుంచి కాపాడేందుకు నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. అలాగే ఆర్ఎస్ఎస్ ఒక సామాజిక-సాంస్కృతిక సంస్థగా దేశ ఐక్యత, సమగ్రత కోసం సేవలందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థలను బలహీనపరచాలని కాంగ్రెస్ పార్టీ కోరడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ప్రజలే అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న దేశ వ్యతిరేక వైఖరిని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించాలని షేక్ బాజీ విజ్ఞప్తి చేశారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని 21వ డివిజన్ యతీరాజు నగర్ 2వ లైన్‌లో డివిజన్ టీడీపీ అధ్యక్షులు "చిన్న మస్తాన్ వలి (నన్నే) నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ముస్లిం సోదరులు ఆత్మీయ స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు తొలుత ప్రత్యేక దువాలో పాల్గొని, ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదర, సోదరీమణులతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొని, వారికి స్వయంగా వడ్డించి తన ఆత్మీయతను చాటుకున్నారు. రంజాన్ మాసం మనకు సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను నేర్పుతుందని గళ్ళా మాధవి గారు పేర్కొన్నారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళలు నాయకత్వ లక్షణాల ద్వారానే సాధికారత సాధ్యం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకొని స్వతంత్రంగా వ్యవహరించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో సొసైటీ ఫర్ పబ్లిక్ లా అండ్ గవర్నెన్స్ విట్ ఏపీ- స్కూల్ ఆఫ్ లా వారు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ. గతంతో పోల్చుకుంటే మహిళలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు సాగుతున్నారని ఇంకా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం ఇంటి నుండే మొదలు కావాలన్నారు. ఆడ,మగ అనే తేడా లేకుండా సమానంగా చూసే సంస్కృతి పెంపొందించాలన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ అమలవుతున్నప్పటికీ పదవుల్లో ఆడవారు ఉన్న పెత్తనం మాత్రం మగవారి చేతిలో సాగుతుందని ఈ విధానానికి స్వస్తి పలికి మహిళల స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. చదువుకునే మహిళలకు వివాహమైనప్పుడు వారి విద్యకు ఆటంకం కలగకుండా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మెటర్నిటీ లీవ్స్ ను మంజూరు చేయాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని చట్టాలు చేసే చట్టసభల్లో కీలక భూమిక పోషించాలన్నారు. మహిళల రక్షణ, సంరక్షణ ఏ ఒక్కరి బాధ్యత కాదని అది సమాజం మొత్తం సమిష్టి బాధ్యతన్నారు. సమాజంలో ఉన్న రుగ్మతలైన బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు, సోషల్ మీడియా మిస్ లీడ్స్ వంటి అంశాలకు వ్యతిరేకంగా మహిళా కమిషన్ పనిచేస్తుందని సమాజం కూడా వీటికి వ్యతిరేకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనేది అత్యంత కీలకమైనది. మహిళలు కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి, దేశ నిర్మాణానికి కూడా బలమైన పునాదులుగా నిలుస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మహిళల హక్కులను కాపాడేందుకు, వారికి న్యాయం అందించేందుకు, భద్రతను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. మహిళల సమస్యలను పరిష్కరించడం మాత్రమే కాకుండా వారికి అవగాహన కల్పించడం కూడా మా ముఖ్య బాధ్యతగా భావిస్తున్నామన్నారు.

# 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'తో నేతన్నల ఆరోగ్యానికి భరోసా



**ధర్మవరం(జర్నలిస్ట్ ఫైల్) :** నేతన్నల ఆరోగ్య రక్షణకు భరోసా ఇస్తూ యూనివర్సల్ హెల్త్ పాలసీలో వారికి ప్రాముఖ్యతనివ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం కింద చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. ధర్మవరం పట్టు చీరకు మరింత ప్రాచుర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.38 కోట్లకు పైగా నిధులతో ఏర్పాటు చేస్తున్న ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఎనిమిది నెలల్లో ప్రారంభించనున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఏర్పాటు చేయబోయే మెగా హ్యాండ్ల్యూమ్ క్లస్టర్ పై చేనేత కార్మికుల అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి పాల్గొని మంత్రి సవిత ప్రసంగించారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ధర్మవరంలో రూ.38 కోట్లకు పైగా నిధులతో మెగా హ్యాండ్ల్యూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ క్లస్టర్ ఏర్పాటుతో ఎనిమిది వేల మంది మహిళలకు ప్రత్యక్ష ఉపాధి కలగనుందన్నారు. ధర్మవరం మెగా హ్యాండ్ల్యూమ్ క్లస్టర్ ను ఎనిమిది నెలల్లో ప్రారంభించనున్నామన్నారు. ఈ క్లస్టర్ ఏర్పాటులో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాత్ర కీలకమన్నారు. ఆయన కృషి వల్లే ధర్మవరంలో మెగా హ్యాండ్ల్యూమ్ క్లస్టర్ ఏర్పాటవుతోందన్నారు.

**నేతన్నలకు ఉచిత విద్యుత్ :** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేసే నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ఏడాదికి మగ్గం నేతన్నలకు ఏడాదికి రూ.8,640లు, మరమగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుందన్నారు. త్వరలోనే నేతన్న భరోసా పథకం కింద చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కంటే అదనంగా రూ.వెయ్యిలు ఇవ్వనున్నామన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు ఇస్తున్నామన్నారు. త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేశామని, చేనేత సహకార సంఘాలకు బకాయిలు కూడా చెల్లిస్తున్నామని వెల్లడించారు.

**ధర్మవరంలో ఆప్కో ఏర్పాటు :** గతంలో కంచి పట్టు చీరలకు డిమాండ్ ఉండేదని, ఇప్పుడు ధర్మవరం పట్టు చీరల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ధర్మవరం పట్టు చీరలో నాణ్యత, నైపుణ్యాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఓడీ ఓపీ అవార్డు అందజేసిందని గుర్తు చేశారు. ధర్మవరం పట్టు చీరలకు మరింత ప్రాచుర్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. 90 శాతం సబ్సిడీపై స్టాండ్ లూమ్స్ అందజేస్తున్నామన్నారు. ధర్మవరంలో చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఆప్కో షో రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు.

**గుడ్ మార్నింగ్ చెప్పడం తప్ప చేసిందేమీ లేదు... :** గత ప్రభుత్వ హయాంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటూ చెప్పడం తప్ప చేసిందేమీ లేదని మంత్రి సవిత విమర్శించారు. ధర్మవరంలో హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామంటూ మోసగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేతలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు తనవంతు కృషి చేశారని మంత్రి సవిత కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన నాయకులు చిలకం మధుసూదన్, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన గర్భిణిల కోసం 35 నూతన నిరీక్షణ వసతి భవనాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం , చింతూరు, కోట రామచంద్రాపురం, శ్రీశైలం ఐటీడీఏల పరిధిలో కలిపి 76 నిరీక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇవి ప్రభుత్వాసుపత్రులకు అనుబంధంగానే పనిచేస్తున్నాయి. ఇందులో 41 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన వాటికి ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి.

**ప్రతి భవనంలో 8 గదులు :** ఒక్కో భవనంలో 8 గదుల్ని నిర్మిస్తున్నారు. వీటిలో 4 గదులు గర్భిణీలకు కేటాయిస్తారు. నాలు గదుల్లో ప్రతి దానికి ఒక మరుగుదొడ్డి నిర్మాణం కూడా జరుగుతోంది. అలాగే ఉమ్మడి వంట గది, రిక్రియేషన్ రూము, ఒక రిసెప్షన్ గది, స్టోర్ రూమును కూడా నిర్మిస్తున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.35 లక్షల చొప్పున వ్యయం చేస్తున్నారు.. ఈ భవనంలో ఏకకాలంలో నలుగురు గర్భిణులు, వారి సహాయకులు ఉండేందుకు వీలుగా ఈ నిర్మాణాలు జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ హెచ్ ఎం) నిధులతో ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. 27 పిహెచ్ సిలు, 6 సిహెచ్ సిలు, 2 ఏరియా ఆసుపత్రులకు అనుసంధానంగా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో మొండెంఖల్లు పీహెచ్ సి, కోట రామచంద్రాపురం ఐటీడీఏ పరిధిలో బుట్టాయిగూడెం సీహెచ్ సి, చింతూరు ఐటీడీఏ పరిధిలో రత్నపురం ఏరియా ఆసుపత్రుల్లో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**13వేల మంది గర్భిణిలకు ప్రయోజనం :** కొండలు, కోనల్లో నివసించే గర్భిణులను ఆశా వర్కర్ , ఎ.ఎన్.ఎం.లు ప్రసవ తేదీకి కనీసం వారం రోజుల ముందు ఇక్కడికి తీసుకువస్తారు. దీనివల్ల ప్రసవ సమయంలో రవాణాపరంగా, ఆరోగ్యపరంగా గర్భిణులకు సమస్యలు తప్పుతాయి. నిరీక్షణ వసతి గృహంలో గర్భిణికి రోజుకి ఆహారం కోసం రూ. 200, సాయంగా ఉండే మరొకరికి రూ.200 చొప్పున ఇస్తారు. సహాయకులుగా ఉండే వారు సదరు రోజుల్లో ఉపాధి కోల్పోయినందుకు నష్టపరిహారం కింద అదనంగా మరో రూ.200 ఇస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 11వేల మంది గర్భిణులు ఈ కేంద్రాల ద్వారా ప్రయోజనం పొందారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 9,500 మంది వైద్య సేవలు పొందారు. ప్రస్తుత నిర్మాణాలు పూర్తయితే ఏడాదికి 13వేల మంది గర్భిణిలు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

## ఇమాములు, మౌజనులకు రూ. 45 కోట్లు విడుదల



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మైనారిటీల అభివృద్ధికి,సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ బద్ధంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ముందుకెళుతున్నదని మంగళవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంజాన్ పర్వదినానికి రెండు రోజులు ముందే రాష్ట్రంలోని ఇమాములు, మౌజన్ లకు ఒకేసారి 6 నెలల గౌరవ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం రూ. 45 కోట్లు విడుదల చేయడమే కాకుండా, కేవలం 24 గంటల లోపలే ఆ మొత్తాన్ని వారి అకౌంట్లకు జమ చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. విజయవాడ ఏ- కన్వెన్షన్ సెంటర్ లో 16వ తేది సాయంత్రం జరిగిన రాష్ట్రస్థాయి ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనం నిమిత్తం రూ.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన కొన్ని గంటల్లోనే నిధుల విడుదల చేస్తూ అదే రోజు రాత్రే మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ జీవో జారీ చేశారని మంత్రి వెల్లడించారు. ఒకేసారి గత ఆరు నెలల బకాయిలను రంజాన్ సందర్భంగా ఒకేసారి కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,000 మంది ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ ప్రక్రియ ను 24 గంటల పూర్తి చేయడం కూడా జరిగిందని కూడా మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 5,000 మంది ఇమామ్‌లకు ఆరు నెలల వేతనం కింద రూ.30 కోట్ల చెల్లింపులు,5,000 మంది మౌజన్లకు ఆరు నెలల వేతనం కింద రూ.15 కోట్లు మొత్తాన్ని వారి అకౌంట్లకు జమ చేయడం జరిగిందన్నారు. మైనారిటీల పక్షపాతిగా సీఎం చంద్రబాబు వారి సంక్షేమం, అభివృద్ధి కోసం 24 గంటలు కృషి చేస్తున్నారని అన్నారు. రంజాన్ పర్వదినానికి రెండు రోజుల ముందే ఇమాములు, మౌజన్ లకు రూ. 45 కోట్లు మొత్తాన్ని గౌరవ వేతనం చెల్లింపు పట్ల రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల తరపున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, మైనారిటీల పక్షపాత ప్రభుత్వంగా వారి సంక్షేమానికి ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

## ముగిసిన కౌన్సిల్ సభ్యుల పదవీకాలం



- వీడ్కోలు అభినందనలు చెప్పిన కమీషనర్ అప్పలనాయుడు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో పురపాలక సంఘంలో5ఏళ్ళు కౌన్సిల్ అధికారం పూర్తి చేసుకున్న క్రమంలో, తుది కౌన్సిల్ సమావేశం,మంగళవారం చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్, మూడవ అంతస్తులోని, తత్కాలిక కౌన్సిల్ హాల్లో, చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించిన, కౌన్సిల్ సమావేశఆద్యాంతం కౌన్సిల్ సభ్యుల, అనుభవాలకు వేదికగా మారింది. 56అంశాల అంజెండాను, ముందస్తుగా ఆమోదించుకున్నారు. సమావేశంలో,ఆయా వార్డుల కౌన్సిలర్లు, తమ పదవీకాలం,పూర్తి కానున్న నేపథ్యాన్ని వివరిస్తు, కౌన్సిల్ సభ్యులు తమకు లభించిన అవకాశానికి, తోడ్పడిన, తమ వార్డు ప్రజలకు, పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. తమ వార్డులలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కొన్నివార్డులలో ఆశించిన మేర అభివృద్ధి జరగలేదన్న భావన వ్యక్తం చేశారు. ఏదేమైనా తమపదవీకాలం ముగిసినా, మాజీ కౌన్సిలర్ అనే పదం జీవితాలం తమతోనే ఉంటుందనే భావన 25వ, వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య వ్యక్తం చేశారు. గుంటూరు కోటేశ్వర్రావు, తమదైన విధాన్ని వ్యక్తం చేస్తు, పదవీకాలం పూర్తయిన, తన వార్డు ప్రజల కోసం తన శక్తి మేర సహాయ సహకారాలు అందిస్తామన్నారు.
సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తమకు పదవుల కాలం ముగిసినా, తమ వార్డులో పెండింగ్ వర్క్ లు పూర్తి చేయాలని అధికారులను కోరారు. చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక తమ వార్డులో, పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎందుకు ప్రారంభించే విషయం, పదే పదే ప్రస్తావించిన, ప్రారంభ కార్యక్రమాల, వాయిదావెనుక ఎవరిదైనా వత్తిడి ఉందా అని,కమీషనర్ ను ప్రశ్నించారు. కమీషనర్ జె. రామ అప్పల నాయుడు తమదైన శైలిలో సమాధానమిచ్చారు. 25కోట్ల మేర, టెండర్లు జరిగి, పనులు పూర్తి కాలేదని, ఇందుకు గల కారణాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 35కోట్ల మేర నిధులు, మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ చొరవతో శాంక్షన్ అయినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు సభ దృష్టికి తెచ్చిన పనులకు, జనరల్ ఫండ్స్ కాకుండా, అదనపు ప్రభుత్వ ఫండ్స్ వచ్చేలా కృషి చేసి,పెండింగ్ పనులు చేస్తామన్నారు. అధికారుల అందరితరపున కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. నొప్పించక, తానొవ్వక అన్నతీరుగా కమీషనర్ తమ సమాధాన ప్రసంగాన్ని చేసారు. అనంతరం. వార్డు కౌన్సిలర్ లకు, మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పల నాయుడు, వీడ్కోలు సత్కారంగా సభ్యులను దుశ్శాలువలతొ సత్కరించారు.
ఈకార్యక్రమంలొ కౌన్సిలర్లతొ పాటు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదే క్రమంలొ చైర్ పర్సన్ చాంబర్లో, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ను, వైసిపి కౌన్సిలర్లు సత్కరించి, వారి అభిమానాన్ని చాటుకున్నారు. మొత్తానికి ముగిసిన పదవీకాలం సభ్యులను ఒక్కింత భావోద్వేగానికి గురి చేసిందనే చెప్పాలి.

## అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అరుదైన గౌరవం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** అక్షయపాత్ర ఫౌండేషన్ 25 ఏళ్ల ప్రస్థానంలో దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు 500 కోట్ల (5 బిలియన్) భోజనాలు అందించి అరుదైన మైలురాయిని అందుకుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం పోషణ్ పథకంలో బాగంగా ఢిల్లీ రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రం(ఆర్బీసీసీ) లో మంగళవారం ప్రత్యేక కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గౌరవ అతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పాల్గొన్ని అక్షయ పాత్ర ప్రతినిధులకు సర్టిఫికేట్ ,షీల్డ్ ను అందచేశారు. అక్షయ పాత్ర ఛైర్మన్ మధు పండిత్ దాస , వైస్ ఛైర్మన్ చంచల పతి దాస, ఆంధ్ర ప్రదేశ్ సెంట్రల్ రీజినల్ ప్రెసిడెంట్ ( మంగళగిరి) వంశధార దాస లకు తదితరులు పాల్గొన్నారు.

**అక్షయ పాత్ర ప్రస్థానం ఇలా :** పిల్లల ఆకలి తీర్చి పాఠశాలలకు హాజరు పెంచటమే లక్ష్యంగా బెంగళూరులో 2000 సంవత్సరంలో 1,500 మంది పిల్లలతో అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రస్థానం ప్రారంభం అయ్యింది. స్వచ్ఛంద పాఠశాల భోజన కార్యక్రమంతో 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 23.50 లక్షల మంది పిల్లలకు నిత్యం పోషకాహారం అందిస్తోంది. 2024 ఏప్రిల్ 2న న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 400 కోట్ల భోజనాలు మైలురాయి వేడుక జరిగింది. నేడు 500 కోట్ల భోజనాల వేడుక ఢిల్లీలో రాష్ట్రపతి సమక్షంలో నిర్వహించారు.

## అందరి సహకారంతో పోలేరమ్మ తిరునాళ్ల



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉమ్మడి గుంటూరు జిల్లా లో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ను అధికారులంతా ఒకరినొకరు సమన్వయ పరుచుకుంటు విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ బి వెంకట స్వామి తెలిపారు. కొండపాటూరు గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షత న పోలేరమ్మ తిరునాళ్ల ఏర్పాట్ల గురించి శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో భాగంగా జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరువనున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పూర్తి స్థాయిలో తగిన ఏర్పాట్లు చేయాలనీ సూచించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ లక్షల్లో భక్తులు హాజరయ్యే తిరున్నాళ్ళ కొద్దిరోజులు మాత్రమే ఉందని కానీ గ్రామానికి వచ్చే రోడ్లు పూర్తి సిద్ధిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఇంతవరకు రోడ్లు మరమ్మత్తులు చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ ఎ ఈ మాట్లాడుతూ ప్రస్తుతం మరమ్మత్తుల నిమిత్తం 25 లక్షల రూపాయలు కు గ్రాంట్ కు ప్రతిపాదనలు పెట్టి ఉన్నారన్నారు. 15 లక్షలకు జడ్పీ నిధులు తో మండల నిధులు కలుపుకొని మారమ్మత్తులు చేపట్టడానికి అధికారులు అంచించ్చినట్లు తెలిపారు. ముందుకు వచ్చి పనులు చేస్తే తదనంతరం బిల్లులు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ జాతర కు సంబంధించి మండల పరిషత్ నుండి 10 లక్షల రూపాయలు కేటాయించ్చామని ఆ నిదులతో వాహనల పార్కింగ్, చెట్ల తొలగింపు వంటి పలు పనులకు ఆ నిధులు కేటాయించ్చినట్లు తెలిపారు. వాటి అనంతరం నిధులు మిగులు ఉంటే మరమ్మత్తులకు కేటాయిస్తామని తెలిపారు. తహసీల్దార్ వెంకట స్వామి మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకొని జాతర ఏర్పాట్లను త్వరతగిన పూర్తి చేయాలనీ సూచించారు. ఎస్ ఐ హరి కృష్ణ మాట్లాడుతూ మల్లె పూల రోజు,జాతర ముందు రోజు పావనం నాడు, జాతర రోజు గ్రామంలో పూర్తి స్థాయిలో బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఎక్కడ అవాంఛనియా సంఘటనలు తలేత్తకుండా ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, డ్రోన్ కెమెరాల తో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతర కు వచ్చే వాహనాల కు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా కాకుమాను నుండి కొండపటూరు వచ్చి కొండపాటూరు నుండి అప్పాపురం మీదుగా వన్ వే మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిడిమాను వెంట ప్రత్యేక రోప్ పార్టీ ఉంటుందన్నారు. ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతరు కు వచ్చే భక్తులకు సౌకర్యర్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దర్శనం కోరకు ప్రత్యేకంగా క్యూ లైన్ ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక జెనరేటర్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యర్థం త్రాగు నీటి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ మల్లె పూల రోజు నుండి గ్రామానికి ప్రత్యేకంగా ఆర్ టి సి బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర నాడు అధిక సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో నీటి ఏద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డస్ట్ బిన్ ల ఏర్పాటు,సరిపడా సిబ్బంది తో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సురభి కాలనీకి కొత్త శోభ



## - అందుబాటులోకి పార్కు, రహదారి

శేరిలింగంపల్లి: మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
శేరిలింగంపల్లి డివిజన్ సురభి కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును, అభివృద్ధి చేసిన జీహెచ్ఎంసీ పార్కును మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ రహదారిని నిర్మించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని, భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. నూతన వసతులు అందుబాటులోకి రావడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు శ్రీకళ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, కోదండరావు, బస్వరాజ్, వెంకట ప్రసాద్, ఈశ్వర స్వరూప్, రమణ కుమార్, సుధా, పూజిత్ సాయి, జైరామ్ ప్రసాద్, జితేందర్ రెడ్డి, ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్

**బెల్లంపల్లి,** మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
బెల్లంపల్లి సబ్‌డివిజన్ నూతన ఏసీపీగా కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించే ముందు ఆయన బెల్లంపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రవికుమార్ డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయగా, ఆయన స్థానంలో హైదరాబాద్ డీఎస్పీ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న కిరణ్ కుమార్‌ను బెల్లంపల్లికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# తాటిగూడలో ఉచిత ఆరోగ్య శిబిరం



**బెల్లంపల్లి** మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తాటిగూడ గ్రామ పంచాయతీలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ప్రజల చెంతకే పాలన, ప్రజల వద్దకే ఆరోగ్యం అనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నదని తెలిపారు.బి.పి., షుగర్ వంటి వ్యాధులు ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చని, అందరూ పరీక్షలు చేయించుకుని వైద్యులు సూచించిన మందులు వాడాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ శిబిరంలో వైద్యులు డా. రేవంత్ కుమార్, డా. అనిల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆశా వర్కర్లు ఉమా, అన్నపూర్ణ, రామదేవి, ఉపాధ్యాయులు రమాదేవి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు.

# బెల్లంపల్లిలో సీపీఐ రాస్తారోకో



**బెల్లంపల్లి,** మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం కంటచౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపుతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతిని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నరసయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు

## రంజాన్ కానుకల పంపిణి



**నార్నూర్** మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం అందిస్తున్న కానుకలను సర్పంచ్ బాణోత్ కావేరి తహసీల్దార్ రాజలింగు గారితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమ్మద్ ఖురేషి, డిప్యూటీ తాసిల్దార్ శ్యామ్ సుందర్, జామా మజీద్ సదర్ హసన్ ఖాన్, సయ్యద్ ఖాసిం, రియాజుద్దీన్, నసీర్, మక్బూల్ తదితరులున్నారు

# ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ మంత్రి, హరీష్ రావు .



మార్చి 17 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారం డివిజన్ ప్రాంతంలో మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారుఈ కార్యక్రమంలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కే చంద్రశేఖర్ రావు నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు.అనంతరం శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కే చంద్రశేఖర్ రావు దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసినట్టు తెలిపారు.నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని, ప్రజల సంక్షేమమే పార్టీ లక్ష్యమని అన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాణిక్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని, కే చంద్రశేఖర్ రావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు శెంబిపూర్ రాజు , మెట్టు కుమార్ యాదవ్.తొంట అంజయ్య గడిల శ్రీకాంత్ తెలంగాణ ఉద్యమ నాయకుడు వెంకటేష్ గౌడ్ గోవర్ధన్ రెడ్డి ప్రభాకర్ జనార్ధన్ సతీష్ ముదిరాజ్ అశోక్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలకు కంప్యూటర్లు సీసీ కెమెరా పంపిణి





(జర్నలిస్ట్ ఫైల్) **రామ్ మందిర్ ఏరియా** మార్చి 17 :
పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 36వ డివిజన్ గాంధీనగర్‌లోని ఎంపీపీఎస్ గాంధీ పార్క్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్లు, సీసీ కెమెరాలు మరియు ప్లే గ్రౌండ్ ఆట పరికరాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు, బెస్ట్ రన్నర్స్ సొసైటీ ప్రతినిధి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఐదు కంప్యూటర్లు, సీసీ కెమెరాలు మరియు ప్లే గ్రౌండ్ ఆట పరికరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ కల్వల పద్మావతి (రంజిత్), మండల విద్యాధికారి జింక మల్లేశం, బెస్ట్ రన్నర్స్ సొసైటీ ప్రతినిధి సతీష్, కార్పొరేటర్లు మీర్జా ఫజల్ బేగ్, వద్లూరి రవి, దాసరి విజయ్ కుమార్, దూళికట్ట సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన: వ్యాల్ల హరీష్ రెడ్డి

## - ఆటో యూనియన్ నాయకుడి కూతురు వివాహానికి చేయూత...

(జర్నలిస్ట్ ఫైల్) **రామ్ మందిర్ ఏరియా** మార్చి 17 :
రామగుండం నియోజకవర్గం లో సోమవారం జరిగిన పలు వివాహాలకు వి హెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఆటో యూనియన్ నాయకులు ఈర్ల ఐలయ్య కుమార్తె వివాహానికి హాజరై వివాహ ఖర్చులకు 20వేల రూపాయలు ఆర్థిక చేయూత నందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి, పేద ఆటో డ్రైవర్లకు అండగా అన్ని విధాలుగా చేయూతనందిస్తానని పేర్కొన్నారు. ఈ కారాయక్రమంలో బి ఆర్ ఎస్ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, కడార్ల శ్రీధర్, మాటేటి రాజేశం, బండి రాజు, ఎల్కపల్లి అంజయ్య, ఎంపెల్లి నారాయణ, బూరుగు వంశీ, క్రిష్ణ, కొండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి సెంటర్లో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం చిన్నారులకు అన్నప్రసన అక్షరాభ్యాసం

(జర్నలిస్ట్ ఫైల్) రామ్ మందిర్ ఏరియా మార్చి 17 :
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ మార్కండేయ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన మరియు అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ మణెమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 59వ డివిజన్ కార్పొరేటర్ బాలసాని తిరుపతి గౌడ్ మరియు 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించడంతో పాటు చిన్నారులకు




అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి మరియు గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన వారికి అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ నాయకత్వంలో రామగుండం నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.అంగన్వాడి సిబ్బంది తల్లీబిడ్డల ఆరోగ్యం, చిన్నారుల విద్యాభివృద్ధి కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెంటర్ సూపర్‌వైజర్, టీచర్, ఆయాలు, పిల్లల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తలు కష్టపడి పార్టీ నిర్మాణం చేశారు - బీజేపీ నాయకులు

- కార్యకర్తలను అవమానిస్తే ఊరుకోనేది లేదు
- కార్యకర్తలే ఎంపీ అరవింద్ కు ఆదర్శం
- ఎంపీ పై ఘాటుగా స్పందించిన రవీందర్ రెడ్డి

(జర్నలిస్ట్ ఫైల్) **జగిత్యాల బ్యూరో** మార్చి 17 :
కార్యకర్తలు కష్టపడి బిజెపి పార్టీని నిర్మాణం చేశారని తాను వచ్చి పార్టీ నిర్మాణం చేశానన్ని ఎంపీ అరవింద్ అనడం హస్యాస్పదంగా ఉందని బిజెపి నాయకులు ముదుగంటి రవీందర్ రెడ్డి అన్నారు.సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు కార్యకర్తలే ఎంపీ అరవిందుకు ఆదర్శమని అరవింద్ కార్యకర్తలకు ఆదర్శం కాదన్నారు.ఎంపీ అరవింద్ కు ఆదర్శం వారి నాన్న డిఎస్ అని నాన్న చనిపోతే బిజెపి కార్యకర్తలు తీసుకెళ్లి నివాళులర్పించుకున్నారని ఆరోపించారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందంటే ప్రతి కార్యకర్త కృషి ఫలమే అని పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరెవరో వస్తూ పోతూ ఉంటారని పార్టీ ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి సిద్ధాంతాల కోసం కట్టుబడి పనిచేసిన వారే నిజమైన కార్యకర్తలని స్పష్టంచేశారు. తమకు ఆదర్శం రామన్న గోపన్న జిత్తన్న అని మీరు తమకు ఆదర్శం కాదని యేండల లక్ష్మీనారాయణ మీ నాన్న ను రెండుసార్లు ఓడించరాని గుర్తు చేశారు. కోరుట్లలో విద్యాసాగర్ రావు గెలిచారు కాబట్టే అక్కడ ఓటు బ్యాంకు ఉందనే అరవింద్ పోటీ చేశారని తన గురించి మాట్లాడే ముందు నీ గురించి



చూసుకోవాలన్నారు.మాకు ఎంపీ ఏనాడు కూడా సమయం ఇవ్వలేదని పార్టీ కార్యక్రమాలను ఎప్పుడు కూడా మమ్మల్ని ఆహ్వానించలేదని జగిత్యాలకు ప్రధాని మోడీ వచ్చినప్పుడు కూడా తమని నిరాకరించారని పేర్కొన్నారు.సినీయర్లకు టికెట్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని మేము నిర్మాణం చేసిన పార్టీలోకి నువ్వు వచ్చావని కార్యకర్తలకు అవమానిస్తే మాత్రం ఊరుకోనే ప్రసక్తే లేదని ఎంపీ అరవింద్ పై ఘాటుగానే స్పందించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి ఏసీఎస్ రాజు సిరికొండ శ్రీనివాస్ అన్కర్ సుధాకర్ కిషోర్ సింగ్ చీటి శేఖర్ రావు బిట్టు మహేందర్ సతీష్ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

# పుట్టాను వెంటనే ఎంపీ పదవి నుండి తొలగించాలి- సన్నల సాయిరాం రెడ్డి

**నంద్యాల ప్రతినిధి** మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :
హైదరాబాదులోని మాజీ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో జరిగినటువంటి వీకెండ్ పార్టీలో ఆంధ్రప్రదేశ్ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ తీసుకున్నట్లు తెలంగాణ పోలీసులు నిర్ధారించడం జరిగింది కావున బహుశా దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 20 లక్షల మందికి ప్రాతినిధ్యం ఊహిస్తున్న ఒక యువ పార్లమెంటు సభ్యుడు ఎంతో మంది యువతకు ఆదర్శంగా ఉండవలసిన వారు ఈ విధంగా డ్రగ్స్ సేవించడం సిగ్గుచేటు కావున వెంటనే వీరిని రాజ్యాంగ పదవి నుంచి తొలగించాలని సన్నాల సాయిరాం రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రిస్తున్నామని ప్రచారం చేస్తున్నారు మరి ఈ ప్రభుత్వ పెద్దలు ఈ అంశంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం రాజకీయ నాయకులు మద్దతు లేకుండా డ్రగ్స్ వ్యాపారం విస్తరణ జడగం లేదని మరోసారి ఈ సంఘటనను రుజువు చేస్తుంది.ఈ సంఘటనపై సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ మరియు హోంమంత్రి అనిత నైతిక బాధ్యత తీసుకొని వారిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ముఖ్యంగా యువతకు ఆదర్శంగా ఉండాల్సిన ఇలాంటి యువ ప్రజా ప్రతినిధులు ఒకపక్క ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే అక్కడ ప్రజా సమస్యలపై స్పందించాల్సిన ఎంపీ ఇలా డ్రగ్స్ పార్టీలో పట్టుబడడం సిగ్గుచేటు ఎంపీగా గెలవడానికి ఓట్లు వేసిన ప్రజలకు మీరు ఏం సమాధానం ఇస్తారు అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ నిరంతరం డ్రగ్స్ పై అనేకమైనటువంటి ఆర్భాటమైన ఉపన్యాసాలు ఇవ్వడం కాదు ముందుగా వీరికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ పార్టీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని యువత భవిష్యత్తును దెబ్బతీసే ఈ



ప్రమాదకరమైన పరిస్థితిని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసు పై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజా నిజాలను ప్రజలకు వెల్లడించాలని దర్యాప్తు సంస్థలను కోరారు.ఈ కార్యక్రమంలో నరసింహ, యువరాజ్ ,దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీరు సౌకర్యం కల్పించిన సర్పంచ్.

నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం



మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలం జంగిలోడి తండా పరిధిలోని రాంచంద్ర పల్లి ప్రాథమిక పాఠశాలలో పది రోజుల కిందట స్కూల్ సందర్శించినప్పుడు అక్కడ తాగునీటి సమస్య ఉందని పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్ దృష్టికి తీసుకురాగ విషయం తెలుసుకొని సోమవారం బోర్ మోటర్ బిగించిన సర్పంచ్ భూక్య గంగాధర్ వారితో పాటు ఉపసర్పంచ్ మలవత్ కౌసల్య స్థానిక తండా గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్పంచ్ గంగాధర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# గోల్డ్ మెడల్స్ సాధించిన నందిగారి సహస్ర కి అపర్ణ శివరాజ్ పాటిల్ సన్మానిచ్చి అభినందనలు తెలిపారు



సదాశివపేట మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : సదాశివపేటలోని శ్రీ వీరశైవసమాజం సిద్ధాపూర్ కాలనీ శ్రీ కృష్ణ నగర్ కాలనీ వారి అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్ కుమార్తె కుమారి నందిగారి సహస్ర కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి కేలో ఇండియా అస్మిత ఉష్ ఉమెన్స్ స్టేట్ లీగ్ 2025-26 కార్యక్రమం గోల్డ్ మెడల్ సాధించింది ఈ కార్యక్రమం బైంసా నిర్మల్ జిల్లాలో జరిగింది.గోల్డ్ మెడల్స్ సాధించిన నందిగారి సహస్ర కి వారికి ప్రోత్సహించినటువంటి వాళ్ళ తల్లిదండ్రులకి మరియు కోచర్స్ కి అపర్ణ శివరాజ్ పాటిల్ సన్మానిచ్చి అభినందనలు తెలియజేశారుఈ కార్యక్రమం లోగ్రాండ్ మాస్టర్ సాజిద్, ముజీబ్ టెక్నికల్ అడ్వైజర్ మహమూద్, మహమ్మద్ షఫీ, శ్రీనివాస్ చిన్న మాస్టర్ వీరశైవ సమాజం జిల్లా సలహాదారు అమ్మిశెట్టి జయప్రకాష్, వీర మహేందర్ అడ్వకేట్ జిల్లా ఉపాధ్యక్షులు, టిఆర్ఎస్ జిల్లా నాయకులు సిహెచ్ సత్యనారాయణ, భాస్కర్,మోహన్,సదాశివపేట పుర ప్రముఖులు పాల్గొన్నారు

# డాక్టర్ కవిత రెడ్డి ని సన్మానించిన డిసిసి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కవిత రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్రనాయకులు జగదం సుమన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులకు తక్షణ చర్యలు తీసుకోవాలి

స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పాండు

ప్రజావాణి అర్జీలు 57 .సంగారెడ్డి, మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ పాండు అన్నారు .సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. భూమి సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ... ప్రజల నుండి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలు , పిర్యాదులు ,వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతినపరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి వినతిని నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపాలని అధికారుల కు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు , ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి బీజేపీ వినతి

నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం



మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు మండల రెవెన్యూ అధికారిని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని వారు విమర్శించారు. రైతులకు రైతు భరోసా, యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు సమయనికి అందడం లేదని తెలిపారు. మండలంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు మంజూరు చేయలని కోరారు. పేదలకు గృహ నిర్మాణ పథకం అమలు వేగవంతం చేయలని విజ్ఞప్తి చేశారు. భూభారతి సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. మండలంలో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయలు, వీధి దీపాల సమస్యలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.సమస్యలపై మండల తహసిల్దార్ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఇందులో జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్ మండల అధ్యక్షుడు గుర్రపు సంజీవ్ రెడ్డి, మండల అధికార ప్రతినిధి రంజిత్ రెడ్డి, మండల కార్యదర్శి జింక రాజేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బందేల ధర్మపురి, మారుతి, అజయ్, నవీన్, తుంపల్లి రాజు, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ..

ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ.

సమస్యల పరిష్కారానికి సంబంధిత ఎస్.హెచ్.ఓలకు తక్షణ ఆదేశాలు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.



సంగారెడ్డి జిల్లా మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి ((గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



# తెలంగాణ ప్రభుత్వము 2026 బడ్జెట్లో ఎరుకల సామాజిక అభివృద్ధి కొరకు 1000 కోట్లు బడ్జెట్ కేటాయించాలి

తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల పురం గోపాల్.



సదాశివపేట మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి రెండు సంవత్సరములు పూర్తిఅయినను గాని ఈ రాష్ట్రంలో ఎరుకల సామాజిక వర్గమునకు ఎటువంటి న్యాయము జరగలేదు. ఎటువంటి అభివృద్ధి ఫలాలకు నోచుకోలేదు. ఎటువంటి ఆర్థికపరమైన రాజకీయపరమైన ఫలితాలు లబ్ధి పొందలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేవెళ్ల గిరిజన మహాసభ డిక్లరేషన్లు లోఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తాననిమరియు ఎరుకల సామాజిక వర్గానికి రాజకీయపరంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తానని చేవెళ్ల గిరిజన మహాసభలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిన వెంటనే నెరవేరుస్తాననిహామీ ఇవ్వడం జరిగినది కానీ ఇందిరమ్మ రాజ్యం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినను ఎరుకల సామాజిక వర్గమునకు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదుహామీలను సంబంధిత మంత్రులతో ఎన్నిసార్లు విన్న వించిననుఫలితం లేకుండా పోయినది. ముఖ్యమంత్రి గిరిజనులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయినారు. మరియు హైదరాబాద్ నిజాంపేట యందు ఎరుకల ఆత్మగౌరవభవనం నిర్మాణం కొరకై మూడున్నర కోట్ల రూపాయలతో భవన నిర్మాణము కొరకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రతిపాదనలు పంపించియున్నాము. నిధులు మంజూరు చేయలేదుతెలంగాణ రాష్ట్రంలో ఎరుకల యువతి యువకులఅభివృద్ధి కొరకు ప్రభుత్వము ఎరుకల ఎన్వవర్మెంట్ స్కీములు ప్రవేశపెట్టినది ఈ యొక్క స్కీముకు నిధులు మంజూరు చేయమని ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు విన్నవించినను ఫలితం లేకుండా పోయినది. రాష్ట్రంలోని ఎస్టీ కార్పొరేషన్ ద్వారా వివిధ స్కీముల కొరకై ఎంపికైన అభ్యర్థులు చాలామంది ఉన్నారు వీరికి సంబంధిత ప్రభుత్వ కార్యాలయం నుండి నియామక పత్రములు ఇచ్చియున్నారు కానీ ఇప్పటివరకు ప్రభుత్వము నుండి కానీ బ్యాంకు ద్వారా గాని ఎటువంటి రుణములు ఇవ్వలేదు సంబంధిత యూనిట్లు గ్రౌండ్ చేయలేదు ఈ విషయముపై సంబంధిత అధికారులకు ప్రభుత్వమునకు ఎన్నిసార్లు విన్నవించును ఫలితం లేకుండా పోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా పి లాయిపల్లి గ్రామంలో ఎరుకల సామాజిక వర్గమునకు ఏకైక దేవాలయం ఎరుకల నాంచారమ్మ దేవాలయం కలదు. ఈ యొక్క దేవాలయము జాతర ప్రభుత్వం అధికారికంగా 5 లక్షల రూపాయలతో జాతర జరిపించుచున్నది గత సంవత్సరము జాతరను మా ఎరుకల సామాజిక వర్గము చెందిన పెద్దలము ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు జరిపియున్నాం కానీ ఇప్పటివరకు గత సంవత్సరము ఇవ్వాల్సిన 5 లక్షల రూపాయల నిధులు ఇప్పటివరకు ప్రభుత్వముమంజూరు చేయలేదు ఈ విషయంపై కూడా సంబంధిత కార్యాలయంలో చాలాసార్లు విన్నవించును అధికారులు స్పందించడం లేదు. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఈ బడ్జెట్ సమావేశములలో ఎరుకల సామాజిక వర్గమునకు ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎరుకల కులమునకు సంబంధించిన నాయకుడిని చైర్మన్నియమించి మరియు ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారికి నామినేటెడ్ పోస్టులు అవకాశం కల్పించి ఈ బడ్జెట్ సమావేశంలో 1000కోట్ల రూపాయలు విడుదల చేసి చేవెళ్ల గిరిజన మహాసభలో ఇచ్చినముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేయుచున్నాము

# ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి

వీబి రామ్ జీ కొత్త చట్టాన్ని రద్దు చేయాలి

కూలీల ఫొటో క్యాప్చర్ ను తీసెయ్యాలి

10 వారాల పెండింగ్ పేమెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

టెంట్, నీళ్లు,మెడికల్ కిట్ కనీస సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సదాశివపేట్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా

అంబేద్కర్ విగ్రహం నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం ఎంపీడీవో హామీ

ఉగాదిలోగా బకాయి పేమెంట్ ఇవ్వకపోతే 25న జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుదాం

మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్




సదాశివపేట మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కూలీల పొట్టగొట్టే విబి రాంజీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతులను కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సదాశివపేటలో ఉపాధి కూలీలతో కలిసి భారీ ధర్నా ఎంపీడీవో కార్యాలయం దగ్గర నిర్వహించడం జరిగింది . ధర్నాకు ముందు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి భారీ ప్రదర్శన ఎంపీడీవో కార్యాలయం వరకు నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేకమైన విధానాలను మోడీ తీసుకువస్తూ ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలు జీతాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు రికార్డితే గాని డొక్కాడని పేద ప్రజల ఉపాధిని దెబ్బతీసే ఉపాధి హామీ పథకాన్ని తీసేయడం కోసమే నరేంద్ర మోడీ కుట్ర చేస్తున్నాడని అన్నారు. దీనికి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి ఏమి కొత్త చట్టం ద్వారా కేంద్రము 90% నిధుల నుంచి 60 శాతం నిధులకు తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం మీద భారం వేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాదానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి 200 రోజులకు పనిని పెంచాలని డిమాండ్ చేశారు. రోజు కూలి కనీసం 600 కూడా రావటం లేదని అన్నారు. పెండింగ్లో ఉన్న పది వారాల పేమెంట్స్ వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీలకు కనీసం మెడికల్ కిట్టు,,పనిముట్లు, నీళ్లు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాత చట్టంలో హక్కులు ఉంటే వాటన్నిటిని తొలగించే విధంగా నరేంద్ర మోడీ కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని యధావిదంగా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పైన ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు ఉపాధి సమస్యలు పరిష్కారం కోసం 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తున్నామని ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు రెండు మూడు నెలలైనా కూలీలకు వేతనం లేక తీర ఇబ్బందులు పడుతున్నారు ఏ విధంగా బతుకు తారని ప్రశ్నించారు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వానికి హెచ్చరించారు సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు ఉపాధి కూలీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో లక్ష్మి గారు హామీని ఇవ్వడం జరిగింది ఎంపీడీవో పరిధిలో ఉన్న మంచినీళ్లు మెడికల్ గేట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు దళిత అంశాలు పరిష్కారం చేస్తామని అన్నారు మిగతా అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్ గౌడ్ యాదవ రెడ్డి భూషణం ఏషోబు ఖయ్యూం సుశీల ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## ప్రముఖ కవి సిధారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 మన తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి లభించడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిధారెడ్డికి ఎంపీ రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారి మానవాళిని వణికించిన సందర్భాన్ని సిధారెడ్డి తన దీర్ఘ కవిత "అనిమేష"ద్వారా వివరించిన తీరును అభినందిస్తూ కేంద్ర ప్రభుత్వం సాహిత్య పురస్కారాన్ని ప్రకటించిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.తెలంగాణ మట్టివాసన తెలిసిన సిధారెడ్డి మనమందరం గర్వించదగ్గ గొప్ప కవి, రచయిత అని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.మంజీరా రచయితల సంఘం ఏర్పాటు చేసి ఇతర సాహితీవేత్తలతో కలిసి తమ రచనలు, కవిత్వం ద్వారా ప్రజలలో చైతన్యాన్ని పాదుగొల్పారన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన జరిగిన మహోద్యమంలో సిధారెడ్డి అగ్రభాగాన నిలిచారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సిధారెడ్డిని వరించడం ఆనందదాయకమని, ఇదేవిధంగా ఆయన మరెన్నో అవార్డులు అందుకోవాలని ఎంపీ వద్దిరాజు ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సదాశివపేట మార్చి 16 నేటి శుభోదయ ప్రతినిధి: బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామ రావుతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్లకార్డులు ప్రదర్శించారు.

## "రైతులకు వెన్నుపోటు రాహుల్‌కు 1000 కోట్లు",

"రాహుల్ బంధు కాదు రైతు బంధు కావాలి",

"పెన్షన్లు పెంచే మాట మరిచారు పేదవాళ్ల నడ్డి విరిచారు",

"మహాలక్ష్మి పథకం మాట మరిచారు మహిళలను నట్టేట ముంచారు"


అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు.

కేశవరంలో ఘనంగా మల్లన్న కళ్యాణం



మూడు చింతలపల్లి, మార్చి 17 (జర్నలిస్ట్ ఫైల్) :మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరం గ్రామంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ నివాసంలో మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు మల్లన్న స్వామి కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మాజీ జడ్పీటీసీ సాయిపేట్ శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేశవరంలో ఘనంగా మల్లన్న కళ్యాణం



మూడు చింతలపల్లి,(జర్నలిస్ట్‌ఫైల్): మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరం గ్రామంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ నివాసంలో మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు మల్లన్న స్వామి కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మాజీ జడ్పీటీసీ సాయిపేట్ శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కబరస్తాన్, ఈద్గాల వద్ద అసాంఘిక కార్యకాలపాల పై చర్యలు తీసుకోండి



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతం లో ఉన్న ఈద్గా, ఖబరస్థాన్ స్థలం ఆక్రమణలతో పాట అసాంఘిక కార్యకలాపాల కట్టడి నివారణ చర్యలు గూర్చి రాజ్యాంగ పరిరక్షణ వేదిక సారధి నగర్ శాఖ ద్వారా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం నగరంలో త్రీ టౌన్ ప్రాంతం గాంధీ చౌక్ దగ్గర గల ఈద్గానందు రంజాన్, బక్రీద్ పండుగ సందర్భంగా ఖమ్మం పట్టణం, రూరల్, ముదిగొండ మండలంలోని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పండగ నమాజులు చదివే ఈద్గా పక్కన ఉన్న ఖాభారస్తాన్ అసాంఘిక కార్యకలాపాల నిలయంగా మారి సరి అయిన రక్షణ లేక పవిత్రంగా చూడాల్సిన స్థలం పవిత్రతకు భంగం కలిగేలా వుందని తెలిపారు. అంతే కాకుండా ఈద్గా , కబరస్తన్ కు చెందిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడం జరిగిందని కలెక్టర్ కి సమర్పించిన వినతి పత్రంలో తెలిపారు. అలాగే ఈద్గా పై ప్రత్యేక దృష్టితో చుట్టూ ప్రహరీ నిర్మాణం గురించి లైటింగ్ ఏర్పాటు చేసినట్లయితే ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉంటాయని సారధి నగర్, గాంధీ చౌక్ ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేసి కలెక్టర్ కు సమర్పించడం జరిగింది అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సారధి నగర్ శాఖ అధ్యక్షులు మహమ్మద్ ఆరిఫ్, కార్యదర్శి షేక్ గౌస్ లు తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అబ్దుల్ ఖదీర్, మాసిన్ యాకోబు తదితరులు ఉన్నారు.

## పన్ను బకాయిలను ఈ నెలాఖరులోపు చెల్లించాలి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఈ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.58 (తేదీ:16-03-2026) జారీ చేసిందని, గుంటూరు నగరంలోని పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నుబకాయిలను ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే వడ్డీతో కలిపి పూర్తిగా పన్ను చెల్లించిన వారికి, సదరు వడ్డీలో 50 శాతం రాబోవు సంవత్సరానికి పన్నులకు జమ కాబడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆస్తి పన్ను మొత్తంలో సగం చెల్లించి మిగిలిన బకాయిలున్న వారు కూడ ఈ నెలాఖరులోపు ఏక మొత్తంలో చెల్లిస్తే వారికి కూడా వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. కావున ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని నగర పరిధిలోని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిన్ కార్యదర్శులు డోర్ టు డోర్ వెళ్లి వడ్డీ రాయితీతో కూడిన స్లిప్స్, హౌస్ సర్వీస్ కనెక్షన్ వివరాలతో నీటి చార్జీల స్లిప్స్ ని 2 రోజుల్లో నూరు శాతం అందించాలని ఆదేశించారు. బుధవారం నుండి ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఈ నెలలో ఉగాది, రంజాన్ వంటి పండుగ, సెలవు రోజుల్లోనూ జిఎంసి మెయిన్, సర్కిల్ కార్యాలయాల్లో కౌంటర్లు పని చేస్తాయని, అవసరమైతే అదనపు కౌంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## తెలుగుతల్లి, హంస ఆకృతులను కళాత్మకంగా మలచిన కాటూరి శిల్పులు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రప్రభుత్వం ఉగాది పర్వదినవేళ విజయవాడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కార ఉత్సవాలలో, పురస్కార గ్రహీతలకు ప్రధానం చేసే, హంస బహుమతి,ఆకృతులను, తెలుగుతల్లి మూర్తులను రూపొందించే అవకాశం తెనాలి లో, మేటి కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులకు లభించడం శుభపరిణామమని తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ శిల్పులకు అభినందనలు తెలిపారుఆటోనగర్ సమీపంలోని కంచర్ల పాలెం రోడ్ లో గల కాటూరి ఆర్ట్ గ్యాలరీలో, కళారత్న కాటూరి వెంకటేశ్వర్రావు, రవిచంద్రలు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాలకు, కంచు లోహంతో మలచిన షీల్డులను పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పురస్కార బహుమతులుగా మలచిన షీల్డులను సునిశితంగా పరిశీంచారు. అనంతరం తహశీల్దార్ కెవి. గోపాల కృష్ణ మీడియాతొ మాట్లాడుతు కళల కాణాచి తెనాలి ఖ్యాతిని ఇనుమ డింపజేసే, కాటూరి శిల్పులు, వెంకటేశ్వర్రావు, రవిచంద్రలు కళాద్రష్టలని అన్నారు.వారు రూపొందించిన ఆకృతులు జీవం ఉట్టిపడేలా ఉన్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతిష్టాత్మక ఉగాది పురస్కార, తెలుగుతల్లి, హంస ఆకృతులను,తయారుచేసే అవకాశం తెనాలి కాటూరి శిల్పులకు లభించడం గొప్పవిషయమన్నారు.

ఈసందర్భంగా కాటూరి శిల్పులు తమ ఆనందాన్ని మీడియా ముఖంగా పంచుకున్నారు. దేశం గర్వించే గ్యాలరీగా, కాటూరి ఆర్ట్ గ్యాలరీని తీర్చిదిద్దుతామన్నారు. 40హంస ప్రతిమలను, 120తెలుగుతల్లి ప్రతిమలను రూపొందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలొ ఆర్ట్ గ్యాలరీ కళాకారులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ప్రతి మంగళవారం మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం
- వీధి కుక్కల సమస్యపై సమిష్టి చర్యలతోనే శాశ్వత పరిష్కారం సాధ్యం - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

మహిళల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే, వాటిని వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. సమిష్టి కృషి ద్వారానే వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ ప్రతి మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా అందుబాటులో ఉంటుందని, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించి మహిళలకు న్యాయం చేయగలిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా మహిళల పట్ల ప్రత్యేక బాధ్యతతో పనిచేస్తున్నానని తెలిపారు. మహిళల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని వేగంగా పరిష్కరించడం తమ కర్తవ్యమని పేర్కొన్నారు.

అలాగే నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యపై ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ సమస్య తీవ్రరూపం దాల్చిందని, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క నెలలోనే సుమారు 3000 కుక్క కాటుకు సంబంధించిన కేసులు నమోదవ్వడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందన్నారు.

వీధి కుక్కల సమస్య ఒకరి సమస్య కాదని, ఇది సమాజం మొత్తానికి సంబంధించినదని పేర్కొన్నారు. ప్రజలు, జంతు ప్రేమికులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి పనిచేస్తేనే దీని పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. కేవలం ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా మాత్రమే సమస్యకు పూర్తి పరిష్కారం రాదని, సమగ్ర ప్రణాళిక అవసరమని చెప్పారు.

జంతు ప్రేమికులు కూడా సమస్య తీవ్రతను అర్థం చేసుకొని మానవుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు. త్వరలో అన్ని వర్గాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు స్థిరమైన పరిష్కారం కనుగొనే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రమాదాలు తగ్గాయి... ఇదే చొరవ కొనసాగించాలి : కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):జిల్లాలో గత ఏడాది కంటే రహదారి ప్రమాదాలు తగ్గాయని, ఇదే చొరవ కొనసాగాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రహదారి భద్రత కమిటీ సమావేశం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం రహదారి ప్రమాదాలు తగ్గింపుపై అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గత 2024 సంవత్సరంలో 1046 ప్రమాదాలు జరిగాయని, 2025సంవత్సరంలో 910జరిగాయని తెలిపారు. రహదారి ప్రమాదాలు వలన ఎప్పుడూ జరిగే మరణాలు 2025 సంవత్సరంలో 19 శాతం తగ్గాయని చెప్పారు. రహదారి ప్రమాదాలు ఇంకా తగ్గించాలని, బ్లాక్ స్పాట్ లు వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఉంటే అటువంటి ప్రదేశాల్లో తీసుకోవలసిన చర్యలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐ రాడ్ లో అన్ని ఆసుపత్రులు నమోదు కావాలని అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మద్యం తీసుకుని వాహనాలు నడిపే వారిపై నిరంతరం డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు. సర్వీసు రహదారి నుండి జాతీయ రహదారిపైకి ప్రవేశించే రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాల్సిన అవసరం ఉందని వివరించారు. నుండి జాతీయ రహదారిపైకి ప్రవేశించే ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించే విధంగా ప్రత్యేక బృందాలతో అవగాహన చేపడుతున్నామని చెప్పారు. ఉప రవాణా కమిషనర్ సీతారామి రెడ్డి మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ లు గుర్తించమని, జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రదేశాల వద్ద ప్రజలు వేగ నియంత్రణ పాటించాలని అన్నారు. జాతీయ రహదారి సాధికార సంస్థ అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు త్వరలో పూర్తి చేయనున్నామని చెప్పారు. రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లు మాట్లాడుతూ 14 బ్లాక్ స్పాట్ లు గుర్తించమని, వాటి వద్ద చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు సమర్పించమన్నారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డి ఎస్పీ బి.శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ సభ్యుల సేవలు అభినందనీయం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): పురపాలక సంఘ పాలకవర్గ పదవీకాలం ముగింపు సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌన్సిలర్ల సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు సేవ చేయడం ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలకు సేవ చేస్తూ మళ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చిన జీవి ఆంజనేయులు, ముఖ్యంగా మహిళా కౌన్సిలర్ల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలకు తన పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వినుకొండ పురపాలక సంఘ అభివృద్ధి వేగవంతమైందని ఆయన అన్నారు. వినుకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజల పక్షాన నిలబడి పని చేసిన వారిని ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని, మళ్లీ కౌన్సిలర్లుగా గెలిచి పురపాలక సంఘంలో అడుగు పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లుగా పనిచేసి ప్రజలకు సేవలు అందించిన వారందరినీ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కౌన్సిలర్లు, పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు మంగళగిరి బస్టాండ్‌కు చంద్రబాబు రాక



- దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభోత్సవం
- హాజరుకానున్న పవన్ కళ్యాణ్, నారా లోకేష్ , మాధవ్ తదితరులు
- రూట్ మ్యాప్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా , ఎస్పీ వకూల్ జిందాల్

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు బుధవారం మంగళగిరిలో పర్యటించనున్నారు. . మంగళగిరి బస్టాండ్ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు "దివ్యాంగ శక్తి" దివ్యాంగులకు ఉచిత బస్ సౌకర్యం ప్రారంభించిన అనంతరం వారితో కలసి మంగళగిరి నుండి ఉండవల్లి రామాలయం బస్టాఫ్ వరకు బస్సులో ప్రయాణించనున్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ , బిజెపి అధ్యక్షులు మాధవ్ తదితరులు పాల్గొన్ననున్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా , గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ మంగళగిరి బస్టాండ్ లో ఏర్పాట్లపై సమీక్షించారు. గుంటూరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ టి సామ్రాజ్యం, మంగళగిరి డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్యతో ఏర్పాట్లపై మాట్లాడారు. అనంతరం ఉండవల్లి రామాలయం బస్టాఫ్ సెంటర్ ను కలెక్టర్, ఎస్పీ సీఎం కార్యాలయ అధికారులు పరిశీలించారు. మధ్యాహ్నం ఎపిఆర్టీసీ ఎండి ఎన్ బాలసుబ్రమణ్యం, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు మంగళగిరి బస్టాండ్ కు చేరుకుని ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్షించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కళామండపంలో సాయంత్రం 4 గంటలకు పోలీస్ బందోబస్తుపై ఎస్పీ వకూల్ జిందాల్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.వి. రమణ మూర్తి, ఎం.టి.ఎం.సి మున్సిపల్ కమిషనర్ అలీం భాషా, నార్త్ సబ్ డివిజన్ డిఎస్పీ సిహెచ్ మురళీ కృష్ణ, మంగళగిరి సిఐ కె వీరా స్వామి, తాడేపల్లి సిఐ వీరేంద్ర, ముఖ్య మంత్రి కార్యాలయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్ ): గజాయి రహిత జిల్లా గా అందరం కసిగట్టుగా తీర్చిదిద్దుదామని బి. మఠం ఎస్సీ శివప్రసాద్ తెలిపారు.డ్రగ్స్,గంజాయి కి వ్యతిరేకంగా DYFI ఆధ్వర్యంలో జన చైతన్య జీపు జాతా పేరుతో బ్రహ్మంగారి మఠం కు చేరుకుంది. సెంటర్ లో జిల్లా ఉపాధ్యక్షులు గండి.సునీల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి DYFI రాష్ట్ర కార్యదర్శి జీ.రామన్న జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని వీరనాల శివకుమార్ లు మాట్లాడుతూ గంజాయి మత్తులో యువత తమ బాధ్యతలను మరచి భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారు అన్నారు.ప్రభుత్వాలు వీటిపై కారణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.వీరు వల్ల జరిగే అనర్థాల పై పాఠశాలలో కళాశాలలో పాఠ్యపుస్తకాలలో చేర్చాలని అన్నారు.ప్రతి నియోజకవర్గ కేంద్రాలలో ప్రభుత్వ ఆసుపత్రులలో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మైదానాలలో ఆధునీకరించాలని అన్నారు.డ్రగ్స్,గంజాయి అంతం DYFI పంతంగా సాగుతామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు విజయ్,నాయకులు అరవింద్ దేవా తదితరులు పాల్గొన్నారు.

## 19న ఉగాది వేడుకలు

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. రాష్ట్ర పండుగగా ఉగాది వేడుకలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు బ్రాడీపేటలో రెవెన్యూ కళ్యాణ మండపంలో 19వ తేదీ ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరవుతారని చెప్పారు. తెలుగుదనం ఉట్టిపడే విధంగా వేడుకలను ఘనంగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నేడు పిల్లల ఉచిత వైద్య శిబిరం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): నేడు మండలంలోని శేకూరు గ్రామంలో చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు . ఈ శిబిరాన్ని రవి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ తెనాలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మేకల రవి తెలిపారు .(బుధవారం ) ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శేకూరు గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ఈ శిబిరం నిర్వహించబడును . ఈ పిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని , ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు , డాక్టర్ కె పురుషోత్తమరావు ప్రారంభిస్తారు . బి జె ఆర్ కమిటీ తెనాలి అధ్యక్షులు మేకల సురేష్ , శేకూరు బాప్టిస్ట్ సంఘం ప్రెసిడెంట్ చీలి మరియదాసు , సెక్రటరీ చిలక కిరణ్ కుమార్ , ట్రెజరర్ శేకూరు ప్రసాద్ స్థానిక కార్యక్రమ నిర్వాహకులుగా ఉండి అందిస్తున్న ఈ పిల్లల ఉచిత వైద్య శిబిరం సదవకాశమును శేకూరు పరిసర గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు .

# బాల్య వివాహాలు నివారణే ధ్యేయం కావాలి

- గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పిలుపు





ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):బాల్య వివాహాలు నివారణే ధ్యేయం కావాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. జిల్లా స్థాయి బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రచార ముగింపు కార్యక్రమం ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. గత నవంబరు 27వ తేదీ నుండి మార్చి 8వ తేదీ వరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికా అమలులో భాగంగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణంలో వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. వివిధ శాఖలు నిర్వర్తించవలసిన ప్రత్యేక కార్యాచరణ పై ఆయా శాఖాధిపతులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు నివారణే ధ్యేయంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు వలన అనేక అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. బాలికల ఆరోగ్యం పెద్ద సమస్యగా మారుతుందని, యుక్త వయసులోనే కుటుంబ భారం పడుతుందని, జీవితం అంటే ఏమిటో తెలిసే సమయానికి జీవితం చరమాంకానికి చేరుతుందని అన్నారు. సమాజంలో బాలికలకు, మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజ నిర్మాణంలో వారికి కీలక పాత్ర అందేటట్లు సహకరించాలని తెలిపారు. బాలికలు, మహిళల ఆరోగ్యం కుటుంబానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బాల్య వివాహాలు సామాజిక రుగ్మత అన్నారు. తల్లిదండ్రులకు సరయిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు.

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు మాట్లాడుతూ బాల్య వివాహత రహిత గ్రామాలుగా గుంటూరు జిల్లాలో అన్ని గ్రామాలను తీర్మానించే క్రమములో ఆ శాఖకు చెందిన వివిధ స్థాయిలలోని బాల్య వివాహ నిషేధిత అధికారులు తమ బాద్యతలు సమర్ధవంతముగా నిర్వహించాలని అన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి డా. సలీం భాషా మాట్లాడుతూ బడి బయట పిల్లలు, ఎక్కువ సార్లు బడికి హాజరు కానీ పిల్లలపై దృష్టి పెట్టి, అటువంటి

పిల్లలు బాల్య వివాహ బాధితులు కాకుండా విద్యా సంస్థలు అన్నిటిలో అవగాహనా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ప్రసూన మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ అన్ని శాఖల సమన్వయ కృషితో సాధ్యమని, వివిధ సమస్యలకు గురి కాబోయే బాలలను క్షేత్ర స్థాయిలో గుర్తించి వారి హక్కుల ఉల్లంఘన కాకుండా రక్షించే క్రమములో వివిధ ప్రభుత్వ శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు సమన్వయం అవసరమన్నారు. ఇతర వక్తలు మాట్లదుచు బాల్య వివాహ రహిత జిల్లాగా గుంటూరు జిల్లాను రూపుదిద్దే క్రమంలో సంబంధిత శాఖ అధికారులు శుద్ధితో పని చేస్తామని తెలిపారు. మహిళా పోలీసు స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పోలీసు వారు మాట్లాడుచు ప్రతి పొలిసు స్టేషన్లో ప్రత్యకముగా కేటాయించబడిన బాలల సంక్షేమ పొలిసు అధికారులు బాల్య వివాహాలు లేకుండా ఇతర బాల రక్షణకు సంబందించిన వివిధ చట్టాలు , విధానాలు అమలులో బాలల స్నేహ పూర్వ పద్ధతితో పని చేస్తారు అని తెలిపారు. బాల్య వివాహం అనే ప్రమాదం నుండి బయట పడి ప్రభుత్వ మరియు కుటుంబాల రక్షణలో ఉన్న చిన్నారులను ఈ సందర్బముగా సత్కరించారు. బాల్ వివాహ ముక్త్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ, మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, మునిసిపల్ అధికారులు, మండల, గ్రామ, వార్డు అధికారులు పాల్గొన్నారు.

# అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ విజయవంతం

- సహకారం అందించిన రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగంలో నిర్వహించిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించేందుకు సహకారం అందించిన రాష్ట్ర జిల్లా యంత్రాంగానికి హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. మంగళవారం జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష యువత యువత కోసం మార్చి 9నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ర్యాలీకి యువత హాజరైన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్కు చెందిన బాలురు ఒకేరోజు ఏడువేలకు పైగా హాజరైన అన్ని పరీక్షలు సకాలంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ కోసం 2025 ఆగస్టు నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల్లో యువతకు వాయుసేన ఉపాధి అవకాశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి రెండు నెలల నుంచి ర్యాలీకి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ర్యాలీ విజయవంతంగా జరగడానికి పూర్తి సహకారం అందించిన గతంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అదేవిధంగా అన్ని ఏర్పాట్లు సమకూర్చిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలికి లైజనింగ్ ఆఫీసర్ జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. పటిష్ట పోలీస్ బందోబస్తు కల్పించిన జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ, మంగళగిరి డిఎస్పి కి, మంగళగిరి సీఐ ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ర్యాలీ నిర్వహించుకోవడానికి ప్రాంగణం అందించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ తో పాటు క్రీడా ప్రాంగణం, స్టేడియాలు వినియోగించుకోవడానికి సహకరించిన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ పాల్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ప్రాంగణంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ చేపట్టిన ఎంటీఎంసీ అధికారులకు, విద్యుత్తు, అగ్నిమాపక, ఎన్ఐసీ, వైద్యారోగ్య శాఖ , పత్రికల్లో కవరేజ్ అందించిన మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల యువత బ్లూ యూనిఫాం ధరించటానికి అవకాశం కల్పించటం సంతోషంగా, సంతృప్తి గా ఉందన్నారు.

సమావేశంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గుణశీల, 12 ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్, సికింద్రాబాద్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం



○ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, ఎస్సీఆర్పీ మరియు ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం చేరుకోవడంలో ఏపీఈడీబీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ పెద్ద లక్ష్యం విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ డైనమిక్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యుత్తమ చిరునామాగా మార్చే ప్రక్రియలో భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అపారమైన అవకాశాలు ఉన్నాయి.. మనం ఇచ్చిన హామీ మేరకు రాబోయే ఐదేళ్లలో లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా, ఆ తర్వాతి కాలంలో అంతకు మించిన విజయాలను నమోదు చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధన కోసం జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. కింది స్థాయిలో ఎంఎస్ఎంఈ గురించి అవగాహన కల్పించాలని... ఇందుకోసం కలెక్టర్లతో పాటు అన్ని శాఖల సహకారం తీసుకుని మీవీజుని పటిష్టం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు కావాల్సిన సంపూర్ణ సహకారం అందిస్తోందని.. ఇది గుర్తించే ప్రపంచ వ్యాప్తంగా ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారని మంత్రి చెప్పారు. ఇది మనమందరం గర్వించాల్సిన విషయం అని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంలో కష్టపడుతోన్న సంబంధిత శాఖాధికారులను కూడా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టి. కృష్ణబాబు, యువరాజ్, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్చకుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలి : ఏపీ అర్చక సేవా సంఘం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళవారం గుంటూరు, బ్రాడిపేట, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాయణం వేణుగోపాల్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశంజరిగింది సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విస్మరించిన అర్చకుల సంక్షేమ పథకాలను దీర్ఘకాలిక సమస్యలు వెంటనే కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. సమావేశం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి మాట్లాడుతూ త్వరలో దేవదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ లతో సంప్రదించి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి కి అపరిష్కృత సమస్యలు తీసుకు వేడతామని అన్నారు,లి లిఅర్చకులవంశపారంపర్య హక్కులు అమలు, సంక్షేమ పథకాలు అమలు, సర్వీస్ ఈనాం భూములున్న అర్చకులకు రెవెన్యూ రికార్డ్స్ లో పేర్లు నమోదు, వేతన అర్చకులకు 65 ు అమలు ద్వారా ట్రెజరి జీతాలు చెల్లించే లాగున కూటమి ప్రభుత్వం సహకరించాలి అని, గత ప్రభుత్వం లో ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలి అని అన్నారు, సమావేశం లో శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించారు, సమావేశాలో రాష్ట్ర నాయకులు ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, పరాశరం జగన్మోహన్, దీవి శేషుబాబు, నందివెలుగు శేషగిరిరావు, యనమదల ఆంజనేయులు, పెద్దింటి పణి రాజేంద్ర కుమార్, బృందావనం గోపీచంద్, వడ్డమాను రమణాచార్య, మేడూరి శ్రీనివాసమూర్తి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉదుంబంచోళలో బీజేపీ బూత్ స్థాయి బలోపేతంపై దృష్టి



○ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ డా. కిలారు దిలీప్

**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళం రాష్ట్రంలోని ఉదుంబంచోళ అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. కిలారు దిలీప్ మంగళవారం వందన్మేడు మండలంలో పార్టీ సమావేశాల్లో పాల్గొన్నారు. వందన్మేడు మండల పరిధిలోని 181 బూత్‌లకు చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులను సమీక్షిస్తూ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేశారు. బూత్ స్థాయి నిర్మాణాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తల సమన్వయం పెంపొందించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.అనంతరం రాజకుమారి పంచాయతీలో నిర్వహించిన మరో సమావేశంలో కీలక కార్యకర్తలతో సమావేశమై గ్రామ స్థాయి పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో బూత్ స్థాయి వ్యవస్థ బలోపేతం అత్యంత కీలకమని పేర్కొన్నారు.పార్టీ కార్యకర్తల ఐక్యత, కృషితో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని సాధిస్తుందని డా. కిలారు దిలీప్ విశ్వాసం వ్యక్తం చేశారు.



# వైసీపీ అంటేనే 'అబద్ధాల ఫ్యాక్టరీ'



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన వారు ఇప్పుడు తమపై వచ్చిన ఆరోపణలను దాటవేసేందుకు ఇతరులపై నిందలు మోపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటంయి చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ వివేకానంద రెడ్డి గారి హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిజం బయటకు రావడం కంటే, ఆ నిజాన్ని పాతిపెట్టడానికి ఎవరెవరు ఎలా ప్రయత్నించారో ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. ఇటీవల ఆయన 7వ వర్ధంతి సందర్భంగా కుమార్తె సునీత గారు వ్యక్తం చేసిన ఆవేదన ప్రతి ఒక్కరినీ కదిలించింది. తండ్రిని కోల్పోయిన బాధతో పాటు, ఏడేళ్లుగా న్యాయం కోసం ఆమె పడుతున్న పోరాటం హృదయ విదారకం అన్నారు. ఒక ఆడబిడ్డ అంతలా విలపిస్తుంటే, కనీసం స్పందించకపోగా.. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో ప్రెస్ మీట్ పెట్టించడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనం. అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ కాబట్టే, ఇప్పటికీ అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

**రక్త చరిత్రను కప్పిపుచ్చే ప్రయత్నం :** హత్య జరిగిన రోజు మార్చి 15న ఉదయం 'గుండెపోటు' అని ప్రచారం చేశారు. ఆ తర్వాత 'రక్తపు వాంతులు' అన్నారు, చివరకు గొడ్డలితో చంపారని తేలింది. సొంత బాబాయిని అంత క్రూరంగా చంపితే, నిందితులను పట్టుకోవాల్సింది పోయి వారిని కాపాడటానికి జగన్ ప్రభుత్వం తాపత్రయపడింది. గూగుల్ టేకవుట్ ఆధారాల ద్వారా ఎవరెవరు ఎప్పుడు ఫోన్ చేశారు, అక్కడ ఏం జరిగిందనేది స్పష్టంగా బయటపడింది. సాక్ష్యాధారాలు తుడవాలని చూసిన వారు, గంగిరెడ్డి ఆసుపత్రి సిబ్బందితో కుట్లు వేయించిన వారు.. నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదం.

**అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిందితుల రక్షణ :** ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణ కావాలని కోరిన జగన్, ముఖ్యమంత్రి కాగానే ఆ విచారణ వద్దు అని అడ్డుతగిలారు. అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి సీబీఐ అధికారులు కర్నూలుకు వెళ్తే, బాంబులు వేస్తామని బెదిరించిన సంస్కృతి వీరిది. సొంత సోదరి సునీతపై లేనిపోని అక్రమ సంబంధాల ఆరోపణలు చేస్తూ, ఆస్తి తగాదాలంటూ తప్పుడు కథనాలు అల్లారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి బాబాయి హత్యకు న్యాయం చేయలేకపోయిన వ్యక్తి, ఇప్పుడు ఆడబిడ్డల మీద బురద చల్లడం దారుణం.

**ప్రజలకు దూరమైన నేత :** జగన్మోహన్ రెడ్డికి ప్రజల మీద గానీ, కుటుంబ సభ్యుల మీద గానీ కనీస ప్రేమ లేదు. కేవలం దోచుకున్న సొమ్మును కాపాడే వారి కోసమే ఆయన తాపత్రయం. ప్రజల మధ్యకు వెళ్లకుండా, కేవలం పెళ్లిళ్లలో బలప్రదర్శన చేస్తూ కాలం గడుపుతున్నారు. రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారు. కానీ, ప్రజలు అన్నీ గమనించే 2024 ఎన్నికల్లో ఆయనకు 11 సీట్లే ఇచ్చి తగిన బుద్ధి చెప్పారు.

**న్యాయం గెలుస్తుంది - చట్టం తన పని తాను చేస్తుంది :** ప్రస్తుత కూటమి ప్రభుత్వం చట్టానికి లోబడి పనిచేస్తుంది. వివేకా హత్య కేసులో సునీతమ్మకు త్వరలోనే న్యాయం జరుగుతుందని మేము ఆశిస్తున్నాం. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి, పెట్టుబడులు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నిరంతరం శ్రమిస్తుంటే, వైసీపీ నాయకులు మాత్రం రౌడీయిజం, అరాచకాలకు పాల్పడుతున్నారు. ఎక్కడైనా వైసీపీ గుండాలు చిల్లర వేషాలు వేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్పైసెస్ ఎగుమతులను రూ.60 వేల కోట్లకు పెంచడమే లక్ష్యం





○ బీజేపీ సీనియర్ నేత, స్పైసెస్ బోర్డ్ సభ్యులు కొత్తూరు వెంకట సుబ్బారావు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో స్పైసెస్ ఎగుమతులను ప్రస్తుత రూ.40 వేల కోట్ల స్థాయి నుంచి రూ.60 వేల కోట్లకు పెంచడమే లక్ష్యంగా స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా చర్యలు చేపడుతోందని బీజేపీ సీనియర్ నేత,స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా సభ్యులు కొత్తూరు వెంకట సుబ్బారావు తెలిపారు.

గుంటూరు నగరంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని మంగళవారం కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పైసెస్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి విజయ సునీత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తూరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్పైసెస్ ఎగుమతుల ద్వారా సుమారు రూ.40 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని తెలిపారు. అందులో గుంటూరు జిల్లాలోని మిర్చి ఉత్పత్తుల వల్ల సుమారు 28 శాతం, దుగ్గిరాల పసుపు యార్డు ద్వారా సుమారు 7 శాతం వ్యాపారం జరుగుతుందని వివరించారు. నాణ్యమైన ఉత్పత్తిని పెంచేందుకు అవసరమైన సహకారాన్ని స్పైసెస్ బోర్డ్ ద్వారా అందిస్తామని తెలిపారు.

రైతులకు సరైన అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ, నాబార్డ్, స్పైసెస్ బోర్డ్, కృషి విజ్ఞాన కేంద్రాలు, హార్టికల్చర్ శాఖలు కలిసి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణలు అందిస్తున్నట్లు చెప్పారు. తక్కువ మందులు ఉపయోగించి అధిక దిగుబడులు సాధించే విధానాలను రైతులకు నేర్పించడం ద్వారా పసుపు, మిర్చి వంటి పంటల ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ఆర్థికంగా బలపడితే వ్యాపారులు, ఎగుమతిదారులు కూడా అభివృద్ధి చెందుతారని, తద్వారా రాష్ట్రం మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారావు , రాష్ట్ర మిర్చి ఎగుమతుల అసోసియేషన్ అధ్యక్షుడు తోట రామకృష్ణ, కార్యదర్శి జుగరాజ్, కొత్తూరు సుధాకర్, నాబార్డ్ అధికారి శరత్, ఆడిటర్ కెవి బ్రహ్మం, మిర్చి యార్డ్ డైరెక్టర్ శ్రావణకుమారి, కొనకళ్ళ సత్యం, కృషి విజ్ఞాన కేంద్ర సభ్యులు, రైతులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్‌కు ఎన్నికైన శ్రీనివాసరాజుకు బీజేపీ ఘన సన్మానం





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఘన విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇంచార్జ్, ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి శ్రీనివాసరాజుకు మంగళవారం ఘనంగా అభినందన సభ నిర్వహించారు. గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలో తనకు ఓటు వేసి గెలుపుకు కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలు పార్టీల కతీతంగా జరిగినవని పేర్కొన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో విధి విధానాలను సమగ్రంగా తెలుసుకుని క్రింది స్థాయి బార్ అసోసియేషన్ల అభివృద్ధికి చిత్తశుద్ధితో, అంకితభావంతో, నిష్పక్ష పాతంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ, శ్రీనివాసరాజు కృషి, పట్టుదల, అంకితభావంతో చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఆయన మరింత సమర్థంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, బీజేపీ సీనియర్ నేతలు కేవీ సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, బండి లక్ష్మణ్, నాగమల్లేశ్వరి యాదవ్, పాలపాటి రవికుమార్, దేసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రావూరు లక్ష్మీనారాయణ, నారదాసు వీరమణి, సుధాకర్, దుర్గాభవాని, శ్రావణకుమారి, సరోజిని, పావని, వైవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా నితిన్ నబీన్‌కు పీవీఎన్ మాధవ్ శుభాకాంక్షలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** బీహార్ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాంకీపూర్ నియోజకవర్గం నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన నితిన్ నబీన్‌కు విశేషమైన రాజకీయ అనుభవం ఉందన్నారు. సంస్థాగత వ్యవహారాలు మరియు సామాజిక రంగాలపై ఆయనకు ఉన్న విశాల పరిజ్ఞానం రాజ్యసభ వేదికగా దేశాభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం దేశ రాజకీయాల్లో మరింత గొప్ప సేవలకు దారి తీస్తుందని మాధవ్ పేర్కొన్నారు. నితిన్ నబీన్ ప్రజాసేవా పయనం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ మరోసారి అభినందనలు తెలిపారు.

## సచివాలయ ఉద్యోగులకే ప్రత్యేక నిబంధనలు ఎందుకు ? : షేక్ అబ్దుల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరు విధానంపై ప్రత్యేక నిబంధనలు తీసుకురావడాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విమర్శించారు. ఈ విధానాల వల్ల సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగులందరికీ హాజరు విషయంలో ఒకే విధమైన విధివిధానాలు అమలులో ఉన్నప్పటికీ, కేవలం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు మాత్రమే ప్రత్యేక నిబంధనలు అమలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఉద్యోగుల హాజరును జీతంతో ముడిపెట్టడం వల్ల సచివాలయ ఉద్యోగులపై అదనపు ఒత్తిడి పడుతోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు ఒకే విధమైన హాజరు విధానం ఉండాలని, ప్రత్యేక నిబంధనల పేరుతో సచివాలయ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ఉద్యోగుల మధ్య తారతమ్యాలను సృష్టించే ప్రమాదం ఉందని అబ్దుల్ రజాక్ అభిప్రాయపడ్డారు. ఈ విధానంపై ప్రభుత్వం పునరాలోచించి సమానత్వంతో కూడిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## మోడల్ స్కూల్ సొసైటీ రద్దు చేసి జీవో 23 అమలు చేయాలి

○ మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మోడల్ స్కూల్ సొసైటీని రద్దు చేసి జీవో నెంబర్ 23ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ ఒక ప్రకటన విడుదల చేశారు.

గత ప్రభుత్వం ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో విలీనం చేసి 010 పద్దు కింద జీతాలు చెల్లించేలా జీవో నెంబర్ 23ను జారీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అయితే ఆ జీవోను బలహీనపరిచేలా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రభుత్వానికి సవరణల ప్రతిపాదనలు పంపడం తగదని తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సేవలు జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సేవల మాదిరిగానే ఉన్నందున వారికి కూడా అదే విధమైన సర్వీస్ నిబంధనలు, సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 13 సంవత్సరాలుగా ఎలాంటి సేవా ప్రయోజనాలు లేకపోయినా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

ఒక ప్రిన్సిపల్ పదవీ విరమణ వయస్సు పెంపు అంశంపై హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల హక్కులను బలహీనపరిచే విధంగా జీవో 23కు సవరణలు ప్రతిపాదించడం అన్యాయమని తెలిపారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ అంశంలో జోక్యం చేసుకుని కమిషనర్ పంపిన సవరణ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని, మోడల్ స్కూల్ సొసైటీని రద్దు చేసి జీవో 23 ద్వారా ప్రభుత్వ సర్వీస్ నిబంధనలు అమలు చేసి ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# డి.ముప్పవరంలో మంత్రి కందుల దుర్గేష్ ఆకస్మిక తనిఖీ

○ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన

○ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంపై ఆరా..కూటమి ప్రభుత్వ విద్యా సంస్కరణలను వివరించిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ మంగళవారం డి.ముప్పవరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాఠశాల సందర్శనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సరదాగా గడిపారు. స్వయంగా పాఠ్యపుస్తకాన్ని చేతబూని విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. "కందుల దుర్గేష్ అంటే ఎవరు? ఈ నియోజకవర్గానికి ఆయన ఏమవుతారు?" అని చమత్కరిస్తూ విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నింపారు. తాను కూడా సామాన్యంగా చదువుకుని పైకి వచ్చిన వాడినేనని, ఎవరూ కంగారు పడకుండా బాగా చదువుకోవాలని హితబోధ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. వంట గదిని తనిఖీ చేసి, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? రాగి జావ రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన మెనూలో ఏవైనా పదార్థాలు తక్కువైతే ధైర్యంగా అడిగి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక సంస్కరణలను ప్రస్తావించారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సాయంపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఆరా తీశారు. విద్యార్థి మిత్ర కిట్ ను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై వివరాలు ఆరా తీసిన మంత్రి దుర్గేష్ తక్షణమే సొంత భవనంలోకి మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఐసీడీఎస్ పీడీని ఫోన్ ద్వారా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల నూతన భవన నిర్మాణాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల బోధనా తీరుపై విద్యార్థుల నుంచి సానుకూల స్పందన రావడంతో వారిని మంత్రి దుర్గేష్ వారిని అభినందించారు.

డి.ముప్పవరం ప్రజలతో మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా మాట్లాడారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. డి. ముప్పవరం గ్రామ అభివృద్ధికి దాదాపు రూ.కోటి రూపాయలు ఖర్చు చేశామన్నారు. గ్రామానికి అంతర్గత రోడ్లు, వాటర్ ట్యాంక్ కావాలని ప్రజలు అడిగారు. వీధి దీపాల సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వంతో చర్చించి స్థానికంగా పదో తరగతి వరకు ఉండేలా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా మార్పు చేశామన్నారు. విద్యార్థుల బాగోగులే తమకు ముఖ్యమన్నారు. ఉగాది నాటికి రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.

Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467